తెలంగాణ
TELANGANA MUCHATLU
# ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
వరంగల్ | మంగళవారం - 10 - మార్చి - 2026 | సంపుటి : 3 | సంచిక : 281 | పేజీలు : 8 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in


## రాజ్యసభలో తెలంగాణ సమస్యలు ప్రస్తావిస్తా

- వేం నరేందర్ రెడ్డి
- కాంగ్రెస్ తరపున రాజ్యసభకు ఏకగ్రీవ ఎన్నిక
- ధృవపత్రాలు అందజేసిన రిటర్నింగ్ అధికారి
- పార్టీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపిన నరేందర్ రెడ్డి



**హైదరాబాద్, 9 మార్చి (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ సమస్యలను రాజ్యసభలో మరియు ఢిల్లీలో గట్టిగా వినిపిస్తానని రాజ్యసభకు ఏకగ్రీవంగా ఎన్నికైన వేం నరేందర్ రెడ్డి తెలిపారు. తెలంగాణ నుంచి కాంగ్రెస్ పార్టీ తరపున అభిషేక్ మను సింఘ్వీ, వేం నరేందర్ రెడ్డి రాజ్యసభ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా రిటర్నింగ్ అధికారి వారికి ధృవపత్రాలను అందజేశారు.

మిగతా 2లో..



## ఒలింపిక్స్ లక్ష్యంగా తెలంగాణలో
# స్పోర్ట్స్ యూనివర్సిటీ

- గచ్చిబౌలి స్టేడియం పునరుద్ధరణకు ఆదేశాలు
- పలు స్టేడియంల ఆధునీకరణపై సమీక్ష
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**హైదరాబాద్, 9 మార్చి (తెలంగాణ ముచ్చట్లు):** ఒలింపిక్స్ లక్ష్యంగా తెలంగాణలో క్రీడాకారులకు అత్యుత్తమ శిక్షణ అందించేందుకు అన్ని సౌకర్యాలతో స్పోర్ట్స్ యూనివర్సిటీ నిర్మించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులకు ఆదేశించారు. రాష్ట్రం నుంచి అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరచే క్రీడాకారులు ఎదగాలని, భవిష్యత్తులో ఒలింపిక్స్ మరియు కామన్‌వెల్త్ క్రీడలకు తెలంగాణ ఆతిథ్యమిచ్చేలా ప్రణాళికలు రూపొందించాలని సూచించారు.

మిగతా 2లో..




## వెలుగుమట్ల బాధితులను పరామర్శించిన కవిత

**ఇళ్ల కూల్చివేతలపై ప్రభుత్వానికి హెచ్చరిక.. బాధితులకు న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తానని భరోసా**

**ప్రభుత్వమే ఇళ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్**

2లో

## బాలికల పాఠశాలలో ఆకస్మిక తనిఖీ చేసిన మంత్రి

- మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి విద్యార్థినులతో కలిసి భోజనం
- నాణ్యమైన ఆహారం అందించాలని సిబ్బందికి సూచనలు
- పాఠశాల సౌకర్యాలపై సమగ్రంగా పరిశీలన



**హుస్నాబాద్, 9 మార్చి (తెలంగాణ ముచ్చట్లు):** హుస్నాబాద్ మండల కేంద్రంలోని సామాజిక సంక్షేమ వసతి గృహ బాలికల పాఠశాలలో రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. సోమవారం మధ్యాహ్న భోజన సమయంలో పాఠశాలను సందర్శించిన ఆయన, ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం విద్యార్థినులకు భోజనం వడ్డిస్తున్నారా లేదా అనే విషయాన్ని స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ప్లేట్ తీసుకొని క్యూ లైన్‌లో నిలబడి భోజనం వడ్డించుకొని విద్యార్థినులతో కలిసి భోజనం చేశారు. మధ్యాహ్న భోజనం తయారు చేస్తున్న వంట సిబ్బందితో మంత్రి మాట్లాడి విద్యార్థినులకు నాణ్యమైన ఆహారం అందించాలని ఆదేశించారు. ఆహారం విషయంలో ఎలాంటి రాజీ పడకూడదని స్పష్టం చేశారు.

మిగతా 2లో..

## సిరిసిల్ల అభివృద్ధి నిధులు రద్దు చేయడం అన్యాయం: కేటీఆర్

- రూ.44 కోట్ల అభివృద్ధి పనులు నిలిపివేశారంటూ విమర్శ
- ప్రజల ప్రయోజనాలకంటే రాజకీయాలు ముందుకు వచ్చాయని ఆరోపణ
- మంచి పనులు రెట్టింపు చేయాలని ప్రభుత్వానికి సూచన



2లో




## సెక్యులరిజానికి కేరాఫ్ కాంగ్రెస్ పార్టీ: మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

- రంజాన్ సందర్భంగా సూర్యాపేటలో ఇఫ్తార్ విందు
- ముస్లింల రక్షణ, సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని వ్యాఖ్య
- సూర్యాపేటలో ముస్లింల సమస్యలు పరిష్కరిస్తామని హామీ

2లో

## ఈవీ స్కూటర్ల ప్రకటనపై బండి సంజయ్ విమర్శలు

- ప్రభుత్వ ప్రాధాన్యతలపై ప్రశ్నలు
- ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలపై ఆందోళన
- రాష్ట్ర పాలన గాడి తప్పిందని వ్యాఖ్యలు




2లో

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్: బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# వెలుగుమట్ల బాధితులను పరామర్శించిన కవిత

**ఖమ్మం, 9 మార్చి (తెలంగాణ ముచ్చట్లు):** ఖమ్మం జిల్లా వెలుగుమట్లలో ఇళ్ల కూల్చివేతలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న బాధితులను తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, శాసన మండలి సభ్యురాలు కల్వకుంట్ల కవిత పరామర్శించారు. ఇళ్లు కోల్పోయి కన్నీరు పెట్టుకుంటున్న మహిళలను చూసి ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఆడబిడ్డల దుఃఖం, వారి కన్నీళ్లు ప్రభుత్వానికి మంచిది కాదని హెచ్చరించారు. ఈ సందర్భంగా బాధితులతో మాట్లాడిన కవిత, తాను ఇక్కడకు పర్యాటకురాలిగా రాలేదని స్పష్టం చేశారు. సమస్యకు పరిష్కారం దొరికే వరకు ఇక్కడే ఉండి పోరాడతానని బాధితులకు భరోసా ఇచ్చారు. జిల్లా కలెక్టర్ మరియు సంబంధిత మంత్రులు వెంటనే వెలుగుమట్లకు వచ్చి బాధితులతో మాట్లాడి వారి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

పేదల ఇళ్లపై బుల్డోజర్లు పంపడం అన్యాయమని కవిత మండిపడ్డారు. కొన్ని రాజకీయ పార్టీలు ప్రజల దుఃఖాన్ని కూడా రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకుంటున్నాయని ఆరోపించారు. గతంలో కూడా ఇళ్ల కూల్చివేతకు ప్రయత్నాలు జరిగాయని ఆమె పేర్కొన్నారు. ఇళ్లను కూల్చివేసిన ప్రాంతాల్లోనే బాధితులకు తిరిగి స్థలాలు కేటాయించి ప్రభుత్వమే ఇళ్లు నిర్మించి ఇవ్వాలని కవిత డిమాండ్ చేశారు. బాధితులకు న్యాయం జరిగే వరకు, సమస్యకు శాశ్వత పరిష్కారం లభించే వరకు ప్రభుత్వంపై ఒత్తిడి కొనసాగిస్తానని ఆమె స్పష్టం చేశారు.



# సిరిసిల్ల అభివృద్ధి నిధులు రద్దు చేయడం అన్యాయం: కేటీఆర్

**హైదరాబాద్, 9 మార్చి (తెలంగాణ ముచ్చట్లు):** సిరిసిల్ల పట్టణ అభివృద్ధికి మంజూరు చేసిన నిధులను కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేయడం అన్యాయమని బీఆర్ఎస్ నాయకుడు కేటీఆర్ విమర్శించారు. తాను మున్సిపల్ శాఖ మంత్రిగా ఉన్న సమయంలో సిరిసిల్ల పట్టణంలో వివిధ అభివృద్ధి కార్యక్రమాల కోసం రూ.44 కోట్లను మంజూరు చేశామని తెలిపారు. అయితే ఆ నిధులను ప్రస్తుత ప్రభుత్వం రద్దు చేయడం ప్రజల ప్రయోజనాలకు విరుద్ధమని కేటీఆర్ పేర్కొన్నారు. బీఆర్ఎస్ పార్టీపై ఉన్న రాజకీయ కోపంతో పాటు సిరిసిల్లపై కూడా అదే కోపాన్ని చూపుతూ అభివృద్ధి కార్యక్రమాలను నిలిపివేశారని ఆరోపించారు. ప్రజల మనసు గెలుచుకోవాలంటే ఇప్పటికే మంజూరు చేసిన నిధులను రద్దు చేయడం కాకుండా మరింతగా అభివృద్ధి పనులు చేపట్టాలని ఆయన సూచించారు. తాను రూ.40 కోట్లు ఇస్తే ప్రభుత్వం రూ.80 కోట్లు ఇవ్వాలని, ఒక మంచి పని చేస్తే రెండు మంచి పనులు చేయాలని అన్నారు. అభివృద్ధి కార్యక్రమాలను రాజకీయాలకు అతీతంగా కొనసాగించాలని కేటీఆర్ తెలిపారు. ప్రజల సంక్షేమమే ప్రభుత్వాల ప్రధాన లక్ష్యంగా ఉండాలని, రాజకీయ విభేదాల కారణంగా అభివృద్ధి పనులను నిలిపివేయకూడదని ఆయన పేర్కొన్నారు.

# ఒలింపిక్స్ లక్ష్యంగా తెలంగాణలో స్పోర్ట్స్ యూనివర్సిటీ

(మొదటి పేజీ తరువాయి)



క్రీడాశాఖకు సంబంధించిన అంశాలపై జరిగిన ఉన్నతస్థాయి సమీక్షా సమావేశంలో ముఖ్యమంత్రి ఈ మేరకు అధికారులతో చర్చించారు. రాష్ట్రంలో ప్రతిపాదించిన యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీకి అంతర్జాతీయ ప్రమాణాల మైదానాలు, శిక్షణ సదుపాయాలు, వసతి గృహాలు వంటి అన్ని సౌకర్యాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. యూనివర్సిటీ నిర్మాణానికి సంబంధించిన పలు నమూనా రూపకల్పనలను పరిశీలించి అధికారులు పలు సూచనలు అందించారు.

గచ్చిబౌలి అవుట్ డోర్ స్టేడియాన్ని పునరుద్ధరించడంతో పాటు అక్కడే ఇండోర్ స్టేడియం, యూనివర్సిటీ సముదాయం, హాస్టల్ భవనాలు, వివిధ క్రీడా మైదానాలు మరియు శిక్షణకు అవసరమైన ఇతర సౌకర్యాలు ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి తెలిపారు. ఈ చర్యలతో రాష్ట్రంలో క్రీడా మౌలిక సదుపాయాలు మరింత బలోపేతం అవుతాయని పేర్కొన్నారు. అలాగే నగరంలోని కోట్ల విజయభాస్కర్ రెడ్డి స్టేడియం, ఎల్‌బీ స్టేడియం, సరూర్‌నగర్ స్టేడియంలను ఆధునీకరించి భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో మంత్రులు వాకిటి శ్రీహరి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, క్రీడా ప్రాధికార సంస్థ అధ్యక్షుడు శివసేనారెడ్డి, యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ ఉపకులపతి డాక్టర్ జి. కిషోర్ తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ఈవీ స్కూటర్ల ప్రకటనపై బండి సంజయ్ విమర్శలు

**హైదరాబాద్, 9 మార్చి (తెలంగాణ ముచ్చట్లు):** కాలేజీ విద్యార్థినులకు ఎలక్ట్రిక్ స్కూటర్లు పంపిణీ చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన ప్రకటనపై కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ తీవ్ర విమర్శలు చేశారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ప్రజా భవన్‌లో జరిగిన కార్యక్రమంలో సీఎం చేసిన ఈ ప్రకటన రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. ప్రభుత్వ ప్రాధాన్యతలు ఎటు వెళుతున్నాయో అర్థం కావడం లేదని బండి సంజయ్ అన్నారు. తన సామాజిక మాధ్యమ వేదిక ద్వారా స్పందించిన ఆయన, రాష్ట్రంలో కాలేజీ విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల సమస్యను ప్రస్తావించారు. వేల కోట్ల రూపాయల ఫీజులు పెండింగ్‌లో ఉండటంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. అలాంటి పరిస్థితుల్లో వాటిని పరిష్కరించకుండా ఉచిత ఎలక్ట్రిక్ స్కూటర్లు ఇస్తామని ప్రకటించడం ప్రజలను తప్పుదారి పట్టించడమేనని విమర్శించారు. దళితులు, గిరిజనులకు పంపిణీ చేయడానికి భూములు లేవని ప్రభుత్వం చెబుతోందని, అయితే జర్నలిస్టులు మరియు మూసీ ప్రాజెక్టు బాధితులకు ఫ్యూచర్ సిటీలో స్థలాలు ఎలా ఇస్తుందని ప్రశ్నించారు. పెన్షన్లు ఇవ్వడానికి నిధులు లేవని చెప్పే ప్రభుత్వం, మూసీ ప్రాజెక్టు కోసం వేల కోట్ల రూపాయలు ఎక్కడి నుంచి తీసుకువస్తుందో చెప్పాలని ఆయన నిలదీశారు. రాష్ట్రంలో పాలన గాడి తప్పిందని బండి సంజయ్ వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలకు దోమల బెడద పెరిగిందని, ప్రజలు తమ పనులు చేసుకుంటున్నా కాంగ్రెస్ నేతలు దోమల్లా వచ్చి ఇబ్బందులు పెడుతున్నారని ఘాటు వ్యాఖ్యలు చేశారు.

# సెక్యులరిజానికి కేరాఫ్ కాంగ్రెస్ పార్టీ: మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

**సూర్యాపేట, 9 మార్చి (తెలంగాణ ముచ్చట్లు):** సెక్యులరిజానికి కేరాఫ్ చిరునామా కాంగ్రెస్ పార్టీనేనని రాష్ట్ర నీటిపారుదల మరియు పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్ ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. ఢిల్లీ నుంచి గల్లీ వరకు ముస్లింలకు అండగా నిలబడే పార్టీ కాంగ్రెస్ మాత్రమేనని ఆయన పేర్కొన్నారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలో రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇఫ్తార్ విందుకు మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ భారతదేశంలో సర్వ మతాలను సమానంగా చూసే పార్టీ కాంగ్రెస్ మాత్రమేనని తెలిపారు. ముస్లింల రక్షణతో పాటు వారి సంక్షేమం మరియు అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ నిరంతరం కృషి చేస్తోందని పేర్కొన్నారు. లోక్‌సభలో కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ నుంచి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వరకు ముస్లింల సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తున్నారని ఆయన అన్నారు. దేశంలో సెక్యులరిజానికి పెద్దపీట వేసింది కాంగ్రెస్ పార్టీనేనని మంత్రి స్పష్టం చేశారు. ముస్లింల అభివృద్ధి, సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వాలు అనేక కార్యక్రమాలు అమలు చేశాయని గుర్తుచేశారు. పవిత్ర రంజాన్ మాసంలో ఇఫ్తార్ విందులో పాల్గొనడం ఆనందంగా ఉందని తెలిపారు. సూర్యాపేటలో ముస్లింల సమస్యలను పరిష్కరించేందుకు జిల్లా మంత్రిగా ఎప్పుడూ అందుబాటులో ఉంటానని ఉత్తమ్ కుమార్ రెడ్డి హామీ ఇచ్చారు. నగరంలో షాధిఖాన, కమ్యూనిటీ హాల్, ఖబరస్తాన్ వంటి సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పర్యాటక సంస్థ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు సర్వోత్తం రెడ్డి, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు గుడిపాటి నర్సయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి, మున్సిపల్ చైర్మన్ మోరిశెట్టి నివేదితా లక్ష్మాది, పిసిసి కార్యదర్శి చకిలం రాజేశ్వరరావు పాల్గొన్నారు.

# బాలికల పాఠశాలలో ఆకస్మిక తనిఖీ చేసిన మంత్రి

(మొదటి పేజీ తరువాయి)

విద్యార్థులకు వడ్డిస్తున్న ఆహారాన్ని ప్రతిరోజూ పరిశీలించాలని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విజయకు సూచించారు. అలాగే పాఠశాల తరగతి గదులు, పరిసరాలను పరిశీలించి తాగునీటి ట్యాంకులను కూడా తనిఖీ చేశారు. పాఠశాలలో అవసరమైన నిర్వహణ పనులు చేపట్టాలని అధికారులకు సూచించారు. విద్యార్థినుల సౌకర్యాల కోసం మరుగుదొడ్లు మరియు అదనపు గదికి అవసరమైన షెడ్డు నిర్మాణాన్ని త్వరలో పూర్తి చేస్తామని తెలిపారు. విద్యా సంవత్సరం ముగింపు దశకు చేరుకున్న నేపథ్యంలో పదవ తరగతి విద్యార్థినులు పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించాలని సూచించారు. ఇతర తరగతుల విద్యార్థులకు పాఠ్యాంశాల పునర్విమర్శ చేపట్టాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమం సందర్భంగా విద్యార్థినులు పాటలు పాడి, కథలు చెప్పగా మంత్రి వారిని అభినందించి సత్కరించారు.

# భవిష్యత్ సవాళ్లకు పోలీసు శాఖ సిద్ధంగా ఉండాలి: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

- పోలీస్ అధికారుల రిట్రీట్ కార్యక్రమంలో సీఎం
- సైబర్ నేరాల నియంత్రణకు సాంకేతికత వినియోగంపై సూచనలు
- 2047 లక్ష్యాలకు అనుగుణంగా కార్యాచరణ రూపొందించాలని పిలుపు



**హైదరాబాద్, 9 మార్చి (తెలంగాణ ముచ్చట్లు):** భవిష్యత్తులో ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కొనేందుకు పోలీసు శాఖ పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉండాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. రాబోయే 25 సంవత్సరాలకు అవసరమైన కార్యాచరణపై చర్చించి ప్రణాళికలు రూపొందించాలని పోలీసు శాఖ అధికారులకు సూచించారు. ఆర్‌బీవీఆర్ఆర్ తెలంగాణ పోలీస్ అకాడమీలో నిర్వహించిన పోలీస్ అధికారుల రిట్రీట్ కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. ఫ్యూచర్ రెడీ కార్యక్రమంలో భాగంగా వివిధ విభాగాల పోలీసు ఉన్నతాధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పోలీసింగ్‌లో చేపట్టాల్సిన మార్పులు మరియు ప్రభుత్వ పరంగా తీసుకోవాల్సిన చర్యలపై వివరించారు. సాంకేతిక పరిజ్ఞానం విస్తరిస్తున్న నేపథ్యంలో కొత్త తరహా నేరాలు పెరుగుతున్నాయని సీఎం పేర్కొన్నారు. సైబర్ నేరాలను అరికట్టేందుకు సైబర్ క్రైమ్ విభాగాన్ని మరింత బలోపేతం చేయాలని సూచించారు. నేరస్థులను త్వరగా గుర్తించేందుకు కృత్రిమ మేధస్సు సాంకేతికతను వినియోగించే అంశాన్ని పరిశీలించాలని అధికారులకు సూచించారు.

ఈ సందర్భంగా తెలంగాణ పోలీస్ అకాడమీ లెర్నింగ్ మేనేజ్‌మెంట్ సిస్టంను ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. అనంతరం పోలీసు అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ శాంతి భద్రతలను కాపాడడంలో తెలంగాణ దేశంలోనే మంచి గుర్తింపు పొందిందని పోలీసు శాఖను అభినందించారు.

దేశంలోని ప్రధాన మెట్రో నగరాల్లో ఎదురవుతున్న సమస్యలను అధ్యయనం చేసి పోలీసింగ్‌లో అవసరమైన మార్పులు తీసుకురావాలని సీఎం సూచించారు. జనాభా ప్రాతిపదికన సిబ్బంది కేటాయింపుపై కూడా ఆలోచించాలని పేర్కొన్నారు. పోలీసు శాఖను మరింత బలోపేతం చేయడానికి అవసరమైన నిధుల కేటాయింపులో ప్రభుత్వం వెనుకడుగు వేయదని సీఎం స్పష్టం చేశారు. అయితే ఆ నిధులు ఫలితాలిచ్చే విధంగా వినియోగం కావాలని అన్నారు. నేర పరిశోధనకు సంబంధించిన డేటాను సాంకేతికంగా అనుసంధానం చేసి ప్రతి పోలీస్ స్టేషన్‌కు త్వరితగతిన సమాచారం అందే విధంగా వ్యవస్థను అభివృద్ధి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ పోలీసు బి. శివధర్ రెడ్డి, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం అధికారులు, సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ శిఖా గోయల్, తెలంగాణ పోలీస్ అకాడమీ డైరెక్టర్ అభిలాష బిష్త్ తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# రాజ్యసభలో తెలంగాణ సమస్యలు ప్రస్తావిస్తా

(మొదటి పేజీ తరువాయి)



ధృవపత్రం అందుకున్న అనంతరం వేం నరేందర్ రెడ్డి మాట్లాడుతూ రాజ్యసభ సభ్యుడిగా అవకాశం కల్పించిన కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరియు రాష్ట్ర మంత్రులకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. రాజ్యసభలో తెలంగాణ ప్రజల సమస్యలను బలంగా ప్రస్తావిస్తానని ఆయన తెలిపారు. రాష్ట్రానికి సంబంధించిన అభివృద్ధి అంశాలు మరియు ప్రజల సమస్యలను కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారం కోసం కృషి చేస్తానని పేర్కొన్నారు. తెలంగాణ అభివృద్ధి మరియు ప్రజల సంక్షేమం కోసం అవసరమైన అంశాలపై కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చే విధంగా రాజ్యసభలో తన వాణిని వినిపిస్తానని వేం నరేందర్ రెడ్డి స్పష్టం చేశారు.

# శంషాబాద్ విమానాశ్రయంలో గంజాయి పట్టివేత

- రూ.3.18 కోట్ల విలువైన మత్తు పదార్థం స్వాధీనం
- హనోయి నుంచి వచ్చిన ఇద్దరు ప్రయాణికుల అరెస్ట్
- కస్టమ్స్ అధికారుల అప్రమత్తతతో పట్టుబడిన స్మగ్లింగ్

**హైదరాబాద్, 9 మార్చి (తెలంగాణ ముచ్చట్లు):** హైదరాబాద్ శంషాబాద్ రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో భారీగా గంజాయిని కస్టమ్స్ అధికారులు పట్టుకున్నారు. ప్రత్యేక సమాచారంతో తనిఖీలు నిర్వహించిన అధికారులు ఇద్దరు ప్రయాణికుల వద్ద నుంచి రూ.3.18 కోట్ల విలువైన మత్తు పదార్థాన్ని స్వాధీనం చేసుకున్నారు. వివరాల ప్రకారం హనోయి నుంచి కౌలాలంపూర్ మార్గంగా ఎయిర్ ఆసియా విమానంలో హైదరాబాద్ చేరుకున్న ఇద్దరు ప్రయాణికులను కస్టమ్స్ అధికారులు అనుమానంతో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారి సామాన్లలో దాచిన గంజాయిని గుర్తించారు. మొత్తం 9.10 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. అంతర్జాతీయ మార్కెట్లో దీని విలువ సుమారు రూ.3.18 కోట్లు ఉంటుందని పేర్కొన్నారు. ఈ ఘటనలో ఇద్దరు ప్రయాణికులను అరెస్ట్ చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు కస్టమ్స్ అధికారులు వెల్లడించారు. మత్తు పదార్థాల అక్రమ రవాణాను అరికట్టేందుకు విమానాశ్రయంలో కఠిన చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు.





# చర్లపల్లిలో ఎంఎస్ఎంఈ ఎగ్జిబిషన్–2026 ప్రారంభం

- పారిశ్రామికవేత్తలకు అండగా ఉంటాం
- ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

**చర్లపల్లి, మార్చి 9 (తెలంగాణ ముచ్చట్లు):**

పారిశ్రామిక ఉత్పత్తులను ప్రదర్శించేందుకు, విక్రయించేందుకు ఎగ్జిబిషన్లు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని ఉప్పల్ నియోజకవర్గ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. సోమవారం చర్లపల్లి పారిశ్రామికవాడలోని సీఐఏ ఆడిటోరియంలో చర్లపల్లి పారిశ్రామికవేత్తల సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎంఎస్ఎంఈ ఎగ్జిబిషన్-2026ను ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు.ఈ సందర్భంగా సీఐఏ అధ్యక్షుడు డి. శ్రీనివాసరెడ్డి, టీఐఎఫ్ అధ్యక్షుడు కొండవీటి సుధీర్ రెడ్డి, చర్లపల్లి ఐఎల్ఏ అధ్యక్షుడు గోవిందరెడ్డిలతో కలిసి ఎమ్మెల్యే ఎగ్జిబిషన్‌లో ఏర్పాటు చేసిన స్టాళ్లను ప్రారంభించి పరిశీలించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పరిశ్రమల్లో తయారయ్యే ఉత్పత్తులను ప్రజలకు పరిచయం చేయడంలో, మార్కెట్ అవకాశాలను పెంపొందించడంలో ఇలాంటి ఎగ్జిబిషన్లు కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. ఉప్పల్ నియోజకవర్గంలోని పారిశ్రామికవాడల అభివృద్ధికి తనవంతుగా కృషి చేస్తానని, పారిశ్రామికవేత్తలకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని తెలిపారు.పారిశ్రామిక ఉత్పత్తుల ప్రదర్శన కోసం ప్రత్యేక కన్వెన్షన్ హాల్ నిర్మాణానికి ముఖ్యమంత్రి, మంత్రులను కలిసి కృషి చేస్తానని ఎమ్మెల్యే చెప్పారు. ఎగ్జిబిషన్‌లో పరిశ్రమలలో వినియోగించే పలు రకాల యంత్రాలు, ఉత్పత్తులతో పాటు బ్యాంకుల స్టాళ్లు కూడా ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలో సీఐఏ కార్యదర్శి మోహన్, చర్లపల్లి ఐఎల్ఏ ఉపాధ్యక్షులు తాటి శ్రీనివాస్, పారిశ్రామికవేత్తలు కట్టంగూరి హరీష్ రెడ్డి, మిరుపాల గోపాల్ రావు, సింగిరెడ్డి సోమశేఖర్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, మల్లిఖార్జున్ రెడ్డి, గంగాధర్ బాబు, కమిటీ సభ్యులు మరియు పలువురు పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.



# విద్యార్థుల ప్రతిభ వెలికితీసేందుకు నేతృత్వ సమావేశాలు

- నారాయణ పాఠశాలలో పీపీ1, పీపీ2 విద్యార్థులతో నిర్వహణ

**తార్నాక, మార్చి 9 (తెలంగాణ ముచ్చట్లు):**

విద్యార్థులలో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు విద్యార్థుల నేతృత్వ సమావేశాలు ఎంతో ఉపయోగపడతాయని పాఠశాల నిర్వాహకులు తెలిపారు. నారాయణ పాఠశాలలో నిర్వహించిన విద్యార్థుల నేతృత్వ సమావేశాల్లో పీపీ 1, పీపీ 2 తరగతుల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాఠశాల జీఎం గోపాల్ రెడ్డి, ఏజీఎం బాల పరమేశ్వరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా చిన్నారులు ఈ విద్యా సంవత్సరంలో నేర్చుకున్న పాఠాలు, గేయాలు, నీతి కథలు మరియు రంగుల గురించి ఇంగ్లీషులో అనర్గళంగా వివరించి అందరినీ ఆకట్టుకున్నారు. ఒకే రంగుతో సంబంధం ఉన్న పండ్లు, పూలు, కూరగాయలు మరియు ఇతర వస్తువులను గుర్తించి చెప్పడం ప్రత్యేకంగా ఆకట్టుకుంది.ఈ సందర్భంగా గోపాల్ రెడ్డి, బాల పరమేశ్వరావు మాట్లాడుతూ విద్యార్థుల ప్రతిభను వెలికి తీసేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. చిన్న వయస్సులోనే విద్యార్థులకు మాట్లాడే ధైర్యం, నాయకత్వ లక్షణాలు పెంపొందించడానికి ఇవి సహాయపడతాయని పేర్కొన్నారు. అనంతరం పాఠశాల ప్రిన్సిపాల్ పర్వీన్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు తయారు చేసిన బోధనోపకరణాల సహాయంతో విద్యార్థులు పండుగలు మరియు వాటి విశిష్టత గురించి వివరించడం గర్వకారణమని అన్నారు.ఈ కార్యక్రమంలో ఆర్‌డీ హెడ్ మీనా, ఈకిడ్జ్ కోఆర్డినేటర్ నూర్, ఈకిడ్జ్ షాహీన్, ఈచాంప్స్ సరిత, సాఫ్ట్ స్కిల్స్ ట్రైనర్ పూజ, పీఈటీ నరేష్, ఏఓ మహేందర్, పాఠశాల సిబ్బంది మరియు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# ఏపీఈఏ, కాన్ఫరెన్స్కు హాజరై రీసెర్చ్ పేపర్ అందజేత

**ఖమ్మం కవిత మెమోరియల్ డిగ్రీ కళాశాల సోషల్ సైన్స్ విభాగ అధ్యాపకురాలు డాక్టర్ఎస్ కే ఆషా బేగం**

**ఖమ్మం బ్యూరో,మార్చి 9(తెలంగాణ ముచ్చట్లు):** ఏపీఈఏ, కాన్ఫరెన్స్కు హాజరై రీసెర్చ్ పేపర్ ను అందజేసిన, ఖమ్మం కవిత మెమోరియల్ డిగ్రీ కళాశాల సోషల్ సైన్స్ విభాగ అధ్యాపకురాలు డాక్టర్ ఎస్ కే ఆషా బేగం, ఖమ్మం కవిత మెమోరియల్ డిగ్రీ కళాశాల సోషల్ సైన్స్ విభాగంలో అధ్యాపకురాలుగా పనిచేస్తున్న డాక్టర్ ఎస్ కే ఆషా బేగం, ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఆంధ్ర యూనివర్సిటీ విశాఖపట్నంలో నిర్వహిస్తున్న ఎక్స్ ఎల్ ఎల్ ఆంధ్రప్రదేశ్ ఎకనామిక్ అసోసియేషన్ ఏపీ ఈఏ కాన్ఫరెన్స్కు హాజరై, ఎంపవర్మెంట్ ఉమెన్ ఎంటర్ ప్రిన్యూర్స్ త్రూ డిజిటల్ లిటరసీ, మరియు కెపాబిలిటీ బిల్డింగ్స్ ఫర్ వికసిత్ భారత్ 2047 అనే అంశంపై రీసెర్చ్ పేపర్ ప్రజెంట్ చేశారు, డాక్టర్ ఎస్ కే ఆశ బేగం లో కళాశాల సెక్రటరీ కోట అప్పిరెడ్డి, కెవి రమణారావు, వివిధ విభాగాల అధిపతులు మరియు అధ్యాపకులు అభినందించారు.








# దివ్యాంగులకు ట్రైసైకిళ్లు, వీల్ చైర్లు పంపిణీ

- ప్రభుత్వ పథకాలను వినియోగించుకుని ఆర్థికంగా ఎదగాలి
- జిల్లా కలెక్టర్ మను చౌదరి

**మేడ్చల్–మల్కాజ్గిరి, మార్చి 9 (తెలంగాణ ముచ్చట్లు):**

దివ్యాంగులు ప్రభుత్వం అందించే పథకాలు, సదుపాయాలను సద్వినియోగం చేసుకుని జీవితంలో ఆర్థికంగా ఎదగాలని మేడ్చల్-మల్కాజ్గిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి అన్నారు. వారికి అవసరమైన మార్గనిర్దేశం, సహాయ సహకారాలను అందించేందుకు ప్రభుత్వం ఎల్లప్పుడూ ముందుంటుందని ఆయన పేర్కొన్నారు.సోమవారం అల్వాల్‌లోని సఖీ సెంటర్‌లో జిల్లా మహిళా, శిశు మరియు వికలాంగుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో దివ్యాంగులకు ట్రైసైకిళ్లు, వీల్ చైర్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ మను చౌదరి 56 ట్రైసైకిళ్లు, 14 వీల్ చైర్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ శారీరకంగా ఇబ్బందులు ఉన్నప్పటికీ దివ్యాంగులు మానసిక ధైర్యంతో ముందుకు సాగి తమ లక్ష్యాలను సాధించాలని సూచించారు. మానసిక ధైర్యం ఉంటే అవకలనం అడ్డంకి కాదని, అన్ని రంగాల్లో దివ్యాంగులు రాణించాలని కోరుకున్నారు. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల కంటే రేపు మెరుగైన స్థాయికి చేరుకోవాలనే సంకల్పంతో ప్రయత్నిస్తే ప్రభుత్వం పూర్తిస్థాయిలో అండగా నిలుస్తుందని తెలిపారు.దివ్యాంగులు సొంతంగా వ్యాపారం, స్టార్టప్‌లు లేదా చిన్న దుకాణాలు ఏర్పాటు చేసుకునేందుకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని కలెక్టర్ పేర్కొన్నారు. అలాగే వారి పిల్లల విద్య, కెరీర్ నిర్మాణానికి అవసరమైన కౌన్సెలింగ్, స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సులు వంటి అంశాలలో కూడా ప్రభుత్వం సహకరిస్తుందని తెలిపారు.ఈసారి వీల్ చైర్లు, ట్రైసైకిళ్లు అందని అర్హులైన వారికి తదుపరి దశలో తప్పకుండా అందించేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ వెల్లడించారు. అనంతరం అదనపు కలెక్టర్ ఫైజన్ అహ్మద్‌తో కలిసి దివ్యాంగులకు ట్రైసైకిళ్లు, వీల్ చైర్లను పంపిణీ చేశారు. కార్యక్రమం అనంతరం కలెక్టర్ సఖీ సెంటర్‌ను పరిశీలించి అక్కడి సేవలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ ఫైజన్ అహ్మద్, ఆర్డీఓ ఓం ప్రకాష్, అల్వాల్ తహసీల్దార్ రాములు, డీడబ్ల్యూఓ శారద తదితరులు పాల్గొన్నారు.





# సబ్సిడీ,వ్యవసాయ యంత్ర పరికరాముల పంపిణి స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి

**వేలేరు, మార్చ్ 09 (తెలంగాణ ముచ్చట్లు):**

ధర్మసాగర్ మండల కేంద్రంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో సబ్సిడీపై వ్యవసాయ పనిముట్ల పంపిణీ కార్యక్రమానికి స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గం హన్మకొండ జిల్లా పరిధిలోని ధర్మసాగర్, వేలేరు మండలాలకు సంబంధించిన 12మంది లబ్ధిదారులకు 50శాతం సబ్సిడీపై రోటవెటర్స్, బేయిలర్స్, స్ప్రేయర్స్ వంటి వ్యవసాయ పనిముట్లను లబ్ధిదారులకు పంపిణి చేశారు. అనంతరం కడియం శ్రీహరి మాట్లాడుతూ ధర్మసాగర్, వేలేరు మండలాలు పూర్తిగా వ్యవసాయం పైన ఆధారపడిన మండలాలని కావున సబ్సిడీ యంత్రాల కేటాయింపులో ఈ రెండు మండలాలకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా వ్యవసాయ అధికారులను కోరారు. డ్రోన్ స్ప్రేయర్స్ లను వ్యక్తులకు కాకుండా రైతు సంఘాలకు గాని, మహిళా సంఘాలకు గాని గ్రామానికి ఒకటి చొప్పున కేటాయించాలని అన్నారు. ప్రభుత్వాలు రైతులకు ఎంత చేసినా తక్కువే నని రైతులు పండించిన పంట చేతికి వచ్చిన నోటికి రావడం లేదని అన్నారు. ఎన్ని చేసినా వ్యవసాయం లాభసాటిగా మారడం లేదని తెలిపారు. స్వామినాధన్ కమిషన్ నివేదిక ను యథాతదంగా అమలు చేయాలనీ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి, ఏడిఏవో, ఏవోలు, సర్పంచులు, ఇతర ప్రజా ప్రతినిధులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

- అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి ఆదేశాలు






**మేడ్చల్–మల్కాజిగిరి, మార్చి 9 (తెలంగాణ ముచ్చట్లు):** ప్రజావాణి కార్యక్రమంలో స్వీకరించిన దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులు జాప్యం లేకుండా పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి అధికారులను ఆదేశించారు.సోమవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారుల నుంచి డిఆర్ఓ (ఇన్‌చార్జి) చంద్రావతితో కలిసి అదనపు కలెక్టర్ మొత్తం 99 దరఖాస్తులను స్వీకరించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ హౌజింగ్ శాఖకు అత్యధికంగా 33 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. ప్రజలు తమ సమస్యలు పరిష్కారమవుతాయని నమ్మకంతో ఎంతో వ్యయప్రయాసలు పడి అధికారుల వద్దకు వస్తారని, వారి నమ్మకాన్ని నిలబెట్టాల్సిన బాధ్యత అధికారులపై ఉందని పేర్కొన్నారు.ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిశీలించి పరిష్కరించాలని, దరఖాస్తుల పరిశీలనలో ఎలాంటి జాప్యం లేకుండా చూడాలని సూచించారు. తిరస్కరించే దరఖాస్తుల విషయంలో తిరస్కరణకు గల కారణాలను తప్పనిసరిగా అర్జీదారులకు వివరించాలని అధికారులకు సూచించారు. అలాగే స్వీకరించిన దరఖాస్తులపై తీసుకున్న చర్యల వివరాలను ఆన్‌లైన్‌లో వెంట వెంటనే నమోదు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# మహిళా దినోత్సవం సందర్భంగా అంగన్వాడీ కేంద్రంలో కుర్చీల పంపిణీ చేసిన కుదుర్ల స్వప్న

**ఖమ్మం బ్యూరో, మార్చి 9 (తెలంగాణ ముచ్చట్లు)**

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం కాకరవాయి గ్రామంలోని నాలుగు అంగన్వాడీ కేంద్రంలలో గర్భిణీ స్త్రీలకు సౌకర్యంగా ఉండే విధంగా కుర్చీలను పంపిణీ చేసినట్లు కుదుర్ల స్వప్న తెలిపారు. గ్రామంలోని అంగన్వాడీ కేంద్రానికి వచ్చే గర్భిణీ స్త్రీలు, బాలింతలు ఎక్కువ సేపు నిలబడి ఉండకుండా సౌకర్యంగా కూర్చోవడానికి ఈ కుర్చీలు ఉపయోగపడతాయని ఆమె పేర్కొన్నారు.

మహిళల ఆరోగ్యం సమాజ అభివృద్ధికి ఎంతో ముఖ్యమని, ముఖ్యంగా గర్భిణీ స్త్రీలు సరైన విశ్రాంతి తీసుకోవడం చాలా అవసరమని స్వప్న అన్నారు. అంగన్వాడీ కేంద్రాలకు వచ్చే గర్భిణీ స్త్రీలు, చిన్నారుల తల్లులు సౌకర్యంగా కూర్చునేందుకు ఈ కుర్చీలను అందజేశామని తెలిపారు. భవిష్యత్తులో కూడా మహిళలు, చిన్నారుల సంక్షేమం కోసం ఇలాంటి సేవా కార్యక్రమాలు కొనసాగిస్తామని చెప్పారు.



అంగన్వాడీ కేంద్రాలు గ్రామాల్లో గర్భిణీ స్త్రీలు, బాలింతలు మరియు చిన్నారులకు పోషకాహారం, ఆరోగ్య సేవలు అందించే ముఖ్యమైన కేంద్రాలుగా పనిచేస్తున్నాయని ఆమె పేర్కొన్నారు. మహిళలు అంగన్వాడీ కేంద్రాల్లో అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని, గర్భధారణ సమయంలో వైద్యుల సూచనలు పాటిస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు, సిబ్బంది, గ్రామ మహిళలు మరియు స్థానికులు పాల్గొన్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని గ్రామస్థులు అభినందించారు.మాజీ ఎస్ఎంసి చైర్మన్ గుంటి ప్రసాద్, 12వ వార్డు సభ్యుడు కుదుర్ల మధు, బోనగిరి మధు, అంగన్వాడి టీచర్లు దాసరి పద్మవతి,గుండా నాగమల్లేశ్వరి,పిల్లలమర్రి కవిత, దికొండ భద్రావతి తదితరులు పాల్గొన్నారు...

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక




## ప్రమాదాలకు చెక్..

### ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి

◆ సీఐ జి. వేణు

**స్టేషన్ ఘనపూర్, మార్చి 9 (తెలంగాణ ముచ్చట్లు):** జనగామ జిల్లా స్టేషన్ ఘనపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు పోలీసులు చర్యలు చేపట్టారు. స్టేషన్ ఘనపూర్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జి. వేణు ఆధ్వర్యంలో స్టేషన్ఘన్పూర్ లోని హోలీ క్రాస్ స్కూల్ ఇప్పగూడలోని శ్రీ బసరా స్కూల్ సమీపంలో ప్రమాద ప్రాంతంగా గుర్తించిన చోట "GO SLOW - ACCIDENT ZONE" హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీఐ జి. వేణు మాట్లాడుతూ, ఈ మార్గంలో వాహనదారులు అధిక వేగంతో ప్రయాణించడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని తెలిపారు. ముఖ్యంగా పాఠశాల సమీప ప్రాంతం కావడంతో విద్యార్థులు మరియు స్థానిక ప్రజల భద్రత దృష్ట్యా వాహనాలు నెమ్మదిగా నడపాలని సూచించారు.

అలాగే వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని, కారులో ప్రయాణించే వారు సీట్ బెల్ట్ వినియోగించాలని అన్నారు. మద్యం సేవించి వాహనం నడపడం, అధిక వేగంతో డ్రైవింగ్ చేయడం వల్లే ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయని హెచ్చరించారు.

ప్రజల ప్రాణ భద్రత కోసం పోలీస్ శాఖ ఎల్లప్పుడూ కట్టుబడి ఉందని, ప్రతి వాహనదారుడు బాధ్యతతో వ్యవహరిస్తే రోడ్డు ప్రమాదాలను తగ్గించవచ్చని సీఐ జి. వేణు పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది మరియు స్థానికులు పాల్గొన్నారు.



## మహిళలే సమాజానికి శక్తి

◆ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళా ఉద్యోగినుల ఘన సన్మానం

**స్టేషన్ ఘనపూర్, మార్చి 9 (తెలంగాణ ముచ్చట్లు):** అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఘనపూర్ స్టేషన్ మున్సిపాలిటీ పరిధిలోని మండల విద్యా వనరుల కేంద్రంలో మహిళా ఉద్యోగినులను ఘనంగా సన్మానించారు. ముదిరాజ్ యువజన సంక్షేమ సంఘం, శివునిపల్లి అధ్యక్షులు గోరంట్ల యాదగిరి ముదిరాజ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించబడింది. ఈ సందర్భంగా సంఘం మహిళా అధికార ప్రతినిధి శ్రీమతి గోరంట్ల నాగరాణి ముదిరాజ్ తో కలిసి మండల విద్యా వనరుల కేంద్రంలో పని చేస్తున్న మహిళా సిబ్బందిని శాలువాలు కప్పి పుష్పగుచ్ఛాలతో ఘనంగా సత్కరించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మండల విద్యాశాఖ అధికారి కొమురయ్య మాట్లాడుతూ మహిళలు కుటుంబానికి ఆధారం, సమాజానికి స్ఫూర్తిగా నిలుస్తున్నారని తెలిపారు. మహిళల సహనం, ప్రేమ, త్యాగం, సేవా భావం సమాజానికి మార్గదర్శకమని పేర్కొన్నారు. మహిళల సేవలను గుర్తించి వారికి సత్కారం అందించిన ముదిరాజ్ యువజన సంక్షేమ సంఘం సభ్యులను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ యువజన సంక్షేమ సంఘం సభ్యులు పిట్టల అజయ్, రేగుల రాకేష్, రేగుల శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు. అలాగే మండల విద్యా వనరుల కేంద్రం సిబ్బంది సునీత, తులసి, శ్రీలత, సంధ్య, వరలక్ష్మి, రాజా, శిరీష, నాగమ్మ తదితరులు హాజరయ్యారు.



## మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం అందించిన వాల్మీకి సంఘం

**పెద్దమందడి,మార్చి9(తెలంగాణ ముచ్చట్లు):** పెద్దమందడి మండలం వెల్టూర్ గ్రామానికి చెందిన బసరతి రాములు ఆదివారం మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న వెల్టూర్ వాల్మీకి మహర్షి సంఘం (1989/859) సభ్యులు మృతుని కుటుంబ సభ్యులకు 5,000/ రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు.ఈ సందర్భంగా సంఘం సభ్యులు మాట్లాడుతూ..కష్టసమయంలో కుటుంబానికి తోడుగా నిలవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు.ఈ కార్యక్రమంలో వాల్మీకి మహర్షి సంఘం సభ్యులు మల్లక్ సురేష్ కుమార్, బి. శ్రీను, సాఖ మన్నెం, బోయ దాసప్ప, భాసరతి బుచ్చయ్య, బసరతి బాలచంద్రయ్య, బసరతి మన్నెం కొండ, బసరతి రాజశేఖర్, బోయ చెన్నయ్య, బోయ శేఖర్, మల్లక్ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## డాక్టర్ పత్తిపాటి లక్ష్మీకాంతమ్మకు 'ఉమెన్ ఆఫ్ ఎక్సలెంట్' అవార్డు




**ఖమ్మం బ్యూరో,మార్చి 08,(తెలంగాణ ముచ్చట్లు)** చింతకాని మండలం అనంతసాగర్ గ్రామానికి చెందిన డాక్టర్ లక్ష్మీకాంతమ్మ కు హైదరాబాద్‌లోని బిర్లా ఆడిటోరియంలో మార్చి 8న నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో పాన్ ఇండియన్ సోషియో కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో డాక్టర్ పత్తిపాటి లక్ష్మీకాంతమ్మకు " ఉమెన్ ఆఫ్ ఎక్సలెన్స్ అవార్డు " ప్రదానం చేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హర్యానా మరియు హిమాచల్ ప్రదేశ్ మాజీ గవర్నర్, కేంద్ర మాజీ మంత్రి బండారు దత్తాత్రేయ హాజరై డాక్టర్ లక్ష్మీకాంతమ్మకు అవార్డు అందజేశారు.ప్రత్యేక అతిథిగా ఇండో కెనడియన్ యూత్ కౌన్సిల్ బీజేపీ స్టేట్ కౌన్సిల్ మెంబర్ రొయ్యూరు శేషసాయి పాల్గొన్నారు. సభకు కళారత్న డాక్టర్ చిలుముల బాల్‌రెడ్డి (పుడమి సాహితీ వేదిక ఫౌండర్ డైరెక్టర్) అధ్యక్షత వహించగా, నేషనల్ చైర్మన్ ఎన్ఐడిసి ఆఫ్ ఈస్ట్ ఇండియా అగర్‌వుడ్ ప్రైవేట్ లిమిటెడ్ యామినేని ఉప్పలరావు, టిటిడి బోర్డు మాజీ సభ్యుడు ధరావత్ బాల్స్ నాయక్ (నల్గొండ జిల్లా), విద్యా విశ్లేషకుడు మరియు గిన్నిస్ బుక్ రికార్డ్ హోల్డర్ బాలరాజు ముద్దాడ గౌరవ అతిథులుగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా డాక్టర్ లక్ష్మీకాంతమ్మ మాట్లాడుతూ మహిళ తలచుకుంటే సాధించలేనిది ఏదీ లేదని తెలిపారు. సృష్టికి జీవం పోసింది మహిళేనని, ఒక తల్లిగా, భార్యగా, బిడ్డగా, అక్కగా, చెల్లిగా అనేక పాత్రలు పోషిస్తున్న మహిళలను సమాజంలో చిన్నచూపు చూడకుండా గౌరవించాలని సూచించారు. మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలను అరికట్టడానికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. మహిళల విలువలను తెలియజేస్తూ ఒక చైతన్య గీతం ఆలపించి సభికులను ఆకట్టుకున్నారు. బండారు దత్తాత్రేయ మాట్లాడుతూ మహిళలు సృష్టికి ఆధారం అని అన్నారు. ఉదయం లేచిన దగ్గర నుంచి రాత్రి వరకు కుటుంబం, వ్యవసాయం, ఉద్యోగం, రాజకీయ రంగాల్లో మహిళలు కష్టపడుతున్నారని, సమాజంలో మహిళలను గౌరవించడం మన సంస్కృతి అని పేర్కొన్నారు. మహిళలు అన్ని రంగాల్లో ముందుకు సాగాలని ఆకాంక్షించారు.ఈ అవార్డు అందుకోవడం తనకు ఎంతో ఆనందంగా ఉందని డాక్టర్ లక్ష్మీకాంతమ్మ తెలిపారు. మహిళలను గౌరవిద్దాం, వారిని కాపాడుదాం అనే సందేశాన్ని ఈ వేదిక ద్వారా అందించారు.

## విద్యార్థులే ఉపాధ్యాయులు.. సందడిగా స్వయం పరిపాలన దినోత్సవం



**పెద్దమందడి,మార్చి9(తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం మద్దిగట్ల మోజర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఉత్సాహభరితంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మొత్తం 48 మంది విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరిస్తూ వివిధ పాఠ్యాంశాలను బోధించారు.విద్యార్థులు కృత్యాధార పద్ధతి, చార్టులు, నమూనాల ద్వారా పాఠాలను బోధిస్తూ తమ ప్రతిభను ప్రదర్శించారు.ఉదయం 9 గంటలకు ప్రార్థనతో ప్రారంభమైన కార్యక్రమం సాయంత్రం వరకు ఉత్సాహంగా కొనసాగింది.ఈ సందర్భంగా కుమారి ఎస్.శిరీష కలెక్టర్‌గా, ఎం. మౌలాలి అడిషనల్ కలెక్టర్‌గా, కుమారి పి. దీప్తి జిల్లా విద్యాశాఖ అధికారిణిగా, కుమారి ఎం.అఖిల మండల విద్యాశాఖ అధికారిగా, కుమారి జే. వైష్ణవి ప్రధానోపాధ్యాయురాలిగా బాధ్యతలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు ఎస్.వరప్రసాద్ రావు, ఉపాధ్యాయులు డి. రణదీవ్, పి. వెంకటస్వామి, గద్వాల కృష్ణయ్య, శ్రీమతి వాణి ప్రభ, ఎం. పుల్లయ్య, మధుసూదన్, ఎన్. వెంకటస్వామి, ఏ.వెంకటస్వామి, కె.శ్రీనివాసులు, కృష్ణవేణి, చిన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.కార్యక్రమానికి న్యాయ నిర్ణేతలుగా పి.వెంకటస్వామి, శ్రీమతి వాణి ప్రభ, ఏ.వెంకటస్వామి వ్యవహరించారు.ఈ సందర్భంగా గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు ఎస్.వరప్రసాద్ రావు మాట్లాడుతూ విద్యార్థి దశలోనే ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా నాయకత్వ లక్షణాలు, బాధ్యతా భావం పెంపొందుతాయని తెలిపారు.ఉపాధ్యాయులు డి. రణదీవ్ మాట్లాడుతూ.. విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా కార్యక్రమంలో పాల్గొన్నారని పేర్కొన్నారు.పి. వెంకటస్వామి మాట్లాడుతూ విద్యార్థులు ఉపాధ్యాయులుగా బోధిస్తూ కార్యక్రమాన్ని ఆనందంగా నిర్వహించారని అన్నారు.గద్వాల కృష్ణయ్య మాట్లాడుతూ దాదాపు 48 మంది విద్యార్థులు పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. శ్రీమతి వాణి ప్రభ విద్యార్థుల బోధన చాలా బాగుందని ప్రశంసించారు.ఎం. పుల్లయ్య మాట్లాడుతూ ప్రతి విద్యార్థి తన విభాగంలో ఎంతో కృషి చేశాడని తెలిపారు.మధుసూదన్ మాట్లాడుతూ.. విద్యార్థులు నిజమైన ఉపాధ్యాయుల్లా వ్యవహరించారని అన్నారు. ఎన్. వెంకటస్వామి మాట్లాడుతూ ఐదుగురు విద్యార్థులు వ్యాయామ ఉపాధ్యాయులుగా వ్యవహరించి ఆటల ద్వారా విద్యార్థులను ఉత్సాహపరిచారని చెప్పారు.ఏ. వెంకటస్వామి మాట్లాడుతూ విద్యార్థుల బోధన, నైపుణ్యం ఆకట్టుకుందని అన్నారు.కె.శ్రీనివాసులు మాట్లాడుతూ.. ఒక్క రోజులోనే కృత్యాలు సిద్ధం చేసి ఉదయం నుంచి సాయంత్రం వరకు బోధించడం అభినందనీయమన్నారు.ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన ఉపాధ్యాయులు, విద్యార్థులందరికీ పాఠశాల తరఫున గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు ఎస్. వరప్రసాద్ రావు కృతజ్ఞతలు తెలిపారు.

## కాంగ్రెస్ పార్టీ కోసం పనిచేసిన ప్రతి కార్యకర్తకు గుర్తింపు

◆ వనపర్తిఎమ్మెల్యే మేఘారెడ్డి



**వనపర్తి,మార్చి9(తెలంగా ముచ్చట్లు):** కాంగ్రెస్ పార్టీ కోసం నిబద్ధతతో పనిచేసిన ప్రతి నాయకుడు, కార్యకర్తకు తగిన గుర్తింపు మరియు బాధ్యతలు కల్పిస్తామని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి తెలిపారు. పార్టీని బలోపేతం చేయడానికి బూత్ స్థాయి నుంచి కమిటీలు ఏర్పాటు చేస్తూ కార్యకర్తలకు అవకాశాలు కల్పిస్తున్నామని ఆయన పేర్కొన్నారు.శ్రీరంగాపురం మండల కాంగ్రెస్ కమిటీ ఏర్పాటు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు శివసేన రెడ్డి, రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి హాజరయ్యారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం పార్టీ తరఫున నిర్వహిస్తున్న ఎన్నికల ప్రక్రియలో బూత్ స్థాయి అధ్యక్షులను నియమిస్తున్నామని చెప్పారు. బూత్ స్థాయి అధ్యక్షుడు, గ్రామ అధ్యక్షుడికి పూర్తి స్వేచ్ఛ ఉంటుందని, వారు గ్రామ సర్పంచ్ స్థాయిలో బాధ్యతలు నిర్వర్తించేలా వ్యవస్థను బలోపేతం చేస్తున్నామని తెలిపారు.ప్రతి కమిటీలో 21 మంది సభ్యులు ఉంటారని, ఆ విధంగానే మండల కమిటీలను ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. పార్టీ కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇవ్వకుండా నిర్లక్ష్యం చేసే వారిని దూరంగా ఉంచడం మంచిదని సూచించారు.ఎక్కడ పార్టీ కార్యక్రమం జరిగినా స్థానిక నాయకులు తప్పనిసరిగా హాజరై ఐక్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు.అందరూ ఒకటిగా ముందుకు సాగితే ఏదైనా సాధించవచ్చని, ప్రతిపక్షాలకు తావు లేకుండా కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయాలని సూచించారు. అలాగే పార్టీ తరఫున ఎన్నికయ్యే వారు జూమ్ కాల్, వాట్సాప్ వంటి డిజిటల్ వేదికలపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు.ఈ సందర్భంగా మండల కమిటీకి సంబంధించిన ఆశావాహుల పేర్లను నమోదు చేసుకున్నట్లు తెలిపారు.మండల కమిటీని త్వరలోనే ప్రకటిస్తామని చెప్పారు.ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ మద్దిలేటి, జిల్లా మాజీ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ యాదవ్, మండల అధ్యక్షుడు రాములు యాదవ్, పీసీసీ జనరల్ సెక్రటరీ నందిమల్ల యాదయ్య, ఓబీసీ జనరల్ సెక్రటరీ కోట్ల రవి, వనపర్తి మార్కెట్ యార్డ్ అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, పెబ్బేరు వ్యవసాయ మార్కెట్ యార్డ్ అధ్యక్షురాలు ప్రమోదుని రెడ్డి, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు శ్రీలత రెడ్డి, జిల్లా యూత్ అధ్యక్షుడు వాకిటి ఆదిత్య, నాయకులు శ్రీహరి రాజు, బీరం రాజశేఖర్ రెడ్డి, న్యాయవాది తిరుపతయ్యతో పాటు వివిధ గ్రామాల సర్పంచులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువకులు, మహిళలు పాల్గొన్నారు.







## మహిళా దినోత్సవం సందర్భంగా అంగన్వాడీ, ఆశా కార్మిక నాయకులకు సన్మానం

◆ స్ఫూర్తి గ్రూప్ ఆధ్వర్యంలో చేనేత వస్త్రాలతో ఘనంగా గౌరవం

**ఏ ఎస్ రావు నగర్, మార్చి 9 (తెలంగాణ ముచ్చట్లు)** అంతర్జాతీయ శ్రామిక మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం స్ఫూర్తి గ్రూప్ ఆధ్వర్యంలో అంగన్వాడీ, ఆశా కార్మిక నాయకులను చేనేత వస్త్రాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి సమన్వయంగా స్ఫూర్తి గ్రూప్ బాధ్యులు గౌడుగు యాదగిరిరావు వ్యవహరించారు.ఈ సందర్భంగా స్ఫూర్తి గ్రూప్ నాయకురాలు పద్మావతి మాట్లాడుతూ శ్రామిక మహిళలు పోరాట యోధులుగా నిలిచి అనేక హక్కులు సాధించారని తెలిపారు. భవిష్యత్తులో కూడా మరిన్ని ఉద్యమాలతో సమాన హక్కులు సాధించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ధరణి పత్రిక మహిళా సంపాదకురాలు రోజా రాణి మాట్లాడుతూ మహిళలు ఐక్యంగా పోరాటం చేస్తేనే వారి హక్కులు సాధ్యమవుతాయని అన్నారు.ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్స్ యూనియన్ అధ్యక్షురాలు డి. అనితను స్ఫూర్తి గ్రూప్ నాయకులు పద్మావతి, అనురాధలు చేనేత వస్త్రాలతో సత్కరించారు. అలాగే సెక్రటరీ రేవతి కళ్యాణిని శ్రీమన్నారాయణ, అనురాధలు గౌరవించారు. అంగన్వాడీ యూనియన్ అధ్యక్షురాలు జి. సునీతను అనురాధ, రోజా రాణిలు చేనేత వస్త్రాలతో సన్మానించగా, యూనియన్ సెక్రటరీ బి. శోభారాణిని రోజా రాణి, పద్మావతిలు సత్కరించారు. పత్రికా రంగంలో 25 సంవత్సరాలుగా సంపాదకీయ బాధ్యతలు నిర్వర్తిస్తూ పత్రికను విజయవంతంగా నడిపిస్తున్న రోజా రాణిని ఐద్వా నాయకులు అరుణ జ్యోతి, సృజన, వినోద, సిఐటియు నాయకురాలు రమలు చేనేత వస్త్రాలతో ఘనంగా సన్మానించారు .ఈ సందర్భంగా అందరికీ అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో నవతెలంగాణ రవి, కోమటి రవి, జయరాజ్, గుమ్మడి హరి ప్రసాద్, జన విజ్ఞాన వేదిక జెన్నీ, అనురాధ, సిహెచ్ లీలావతి, పద్మావతి, రోజా రాణి తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్: బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక





## ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు

**హనుమకొండ,మార్చి09(తెలంగాణ ముచ్చట్లు):** అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలు కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. బంజారా వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి అసోసియేషన్ అధ్యక్షుడు వి.ఎన్. నాయక్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మహిళలతో కలిసి కేక్ కట్ చేసి అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని తొలుత అంతర్జాతీయ మహిళా శ్రామిక దినోత్సవంగా పిలిచేవారని పేర్కొన్నారు. సమాజ అభివృద్ధిలో మహిళల పాత్ర ఎంతో ముఖ్యమని తెలిపారు. దుర్గాబాయి దేశ్‌ముఖ్, ఝాన్సీ రాణి, ఇందిరా గాంధీ వంటి మహిళలు నేటి తరానికి ఆదర్శమని చెప్పారు. పనిచేసే ప్రతి చోట మహిళలకు గౌరవం, గుర్తింపు ఇవ్వాల్సిన అవసరం ఉందని సూచించారు. మహిళలు ఆర్థిక, రాజకీయ హక్కులతో పాటు సామాజికంగా కూడా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో వీరమ్మ, అర్పిత, అర్చన, మాలతి, అనసూయ, నాగేశ్వరి, అన్నపూర్ణ, సుజిత తదితర మహిళలు పాల్గొన్నారు. అలాగే నునావత్ జవహర్లాల్, లావుడియా పల్లవి, రాజు నాయక్, రమేష్, ధన్‌సింగ్, శారద తదితరులు హాజరయ్యారు. వివిధ శాఖల్లో పనిచేస్తున్న మహిళలతో కలిసి అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమానికి సహకరించిన అందరికీ బంజారా వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.



## మండల కమిటీలు పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

◆ డా. జిల్లెల చిన్నారెడ్డి

**వనపర్తి,మార్చి9(తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని గ్రామ స్థాయిలో మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో శ్రీరంగాపురం మండలం, పెబ్బేరు మండలం, పెబ్బేర్ టౌన్‌లలో నూతన మండల కమిటీలను ఏర్పాటు చేసినట్లు రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి తెలిపారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొత్తకాపు శివసేనారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఆయనతో పాటు నియోజకవర్గ శాసనసభ్యులు తూడి మెగా రెడ్డి నూతన కమిటీలను ప్రకటించారు.ఈ సందర్భంగా డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి మాట్లాడుతూ భారత దేశానికి స్వాతంత్ర్యం సాధించడంలో కాంగ్రెస్ పార్టీ కీలక పాత్ర పోషించిందన్నారు.స్వాతంత్ర్యం అనంతరం దేశాన్ని పేదరికం నుంచి అభివృద్ధి దిశగా తీసుకెళ్లేందుకు కాంగ్రెస్ పార్టీ అనేక కార్యక్రమాలు చేపట్టిందని తెలిపారు.స్వాతంత్ర్య ఉద్యమంలో బీజేపీ నాయకుల పాత్ర శూన్యమని ఆయన విమర్శించారు.కాంగ్రెస్ పార్టీ సామాజిక న్యాయం, ఆర్థిక సమానత్వం, పేదరిక నిర్మూలనకు కట్టుబడి పనిచేస్తోందని పేర్కొన్నారు.కాంగ్రెస్ పార్టీ కోసం నిబద్ధతతో పనిచేసే కార్యకర్తలకే పదవులు దక్కుతాయని తెలిపారు.దేశంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసి రాహుల్ గాంధీని ప్రధానమంత్రిగా చూడాలనే లక్ష్యంతో పార్టీ ముందుకు సాగుతోందని,రాబోయే ఎన్నికల్లో రాహుల్ గాంధీ ప్రధాని కావడం ఖాయమని విశ్వాసం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నందిమల్ల యాదయ్య, వనపర్తి జిల్లా కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ యాదవ్, జిల్లా ఓబీసీ అధ్యక్షుడు కోట్ల రవి, వనపర్తి పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ కదిర రాములు యాదవ్, జిల్లా కాంగ్రెస్ సోషల్ మీడియా కోఆర్డినేటర్ పురుషోత్తం, శ్రీరంగాపురం మండల అధ్యక్షుడు రాములు యాదవ్, వనపర్తి జిల్లా ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడు రోహిత్, వనపర్తి మండల ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడు ఎత్తం చరణ్ రాజ్, శ్రీరంగాపురం గ్రామ సర్పంచ్ మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.



## పదవ తరగతి విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడ్లు పంపిణీ

**వేలేరు, మార్చ్ 09 (తెలంగాణ ముచ్చట్లు):** పదవ తరగతి పబ్లిక్ పరీక్షల నేపథ్యంలో వేలేరు పోలీసుల ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ఎస్.ఐ సురేష్ కుమార్ ఎగ్జామ్ ప్యాడ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పరీక్షలను భయపడకుండా ధైర్యంగా ఎదుర్కొని కష్టపడి చదివితే మంచి ఫలితాలు సాధించవచ్చని సూచించారు. ఒత్తిడికి లోనవకుండా సమయాన్ని సక్రమంగా వినియోగించుకుని చదువుపై దృష్టి పెట్టాలని తెలిపారు.

ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొన్నారు.





# అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మండల మహిళా సమావేశం

**వేలేరు, మార్చ్ 09 (తెలంగాణ ముచ్చట్లు):** వేలేరు మండల కేంద్రంలో మండల మహిళా సమైక్య అధ్యక్షురాలు శ్రీమతి రేణుక, ఏపీఎం శ్రీమతి అనిత ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మండల సమావేశం నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సర్పంచుల ఫోరం అధ్యక్షులు బిల్లా యాదగిరి హాజరై మాట్లాడుతూ మహిళలందరికీ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. మహిళలు ఆర్థికంగా ఎదగాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం మహిళా సంఘాలకు అనేక పథకాలు అందిస్తున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఎంపీ కడియం కావ్య ఆధ్వర్యంలో మండలంలోని గ్రామాల్లో వివో భవనాలకు నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ శ్రీకర్, మండల సమైక్య కార్యదర్శి రాజమ్మ, కార్యవర్గ సభ్యులు, సీసీలు, వివిధ గ్రామాల వివో అధ్యక్షులు, కార్యదర్శులు, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.









## కలెక్టరేట్‌లో ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు

**మేడ్చల్–మల్కాజిగిరి, మార్చ్ 9 (తెలంగాణ ముచ్చట్లు):** మహిళలు సాధించిన విజయాలను గుర్తుచేసుకోవడం, సమాజంలో వారికి సమాన గౌరవం మరియు హక్కులు కల్పించాల్సిన అవసరాన్ని తెలియజేస్తూ అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో ఘనంగా నిర్వహించారు. తెలంగాణ గజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ (టీజీఓఏ) ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మహిళా సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా చెస్, క్యారం, లెమన్ అండ్ స్పూన్, స్పీడ్ వాకింగ్, రన్నింగ్, టగ్ ఆఫ్ వార్, మ్యూజికల్ చైర్ వంటి పలు ఆటల పోటీలను నిర్వహించారు. అనంతరం జరిగిన సభా కార్యక్రమానికి జిల్లా ఇంచార్జి రెవెన్యూ అధికారిని చంద్రావతి తో కలిసి ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ మను చౌదరి సతీమణి డా.రాధ మను చౌదరి హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అమ్మాయి చదువుకుంటే సమాజం అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. మహిళలు మానసికంగా ధృడంగా ఉండి కృషి చేస్తే ఏ రంగంలోనైనా ముందంజలో నిలుస్తారని తెలిపారు. ఆడపిల్లల విద్యాభివృద్ధికి మహిళలు ముందుండి ప్రోత్సాహం అందించాలని సూచించారు .ఈ కార్యక్రమం లో జిల్లా విద్యాధికారిని విజయకుమారి, జిల్లా షెడ్యూల్డ్ కాస్ట్ అభివృద్ధి అధికారి వినోద్, డీఆర్‌డీఓ సాంబశివరావు, జిల్లా యువజన మరియు క్రీడల అధికారి దామోదర్ రెడ్డి, జిల్లా సివిల్ సప్లై అధికారిని సుగుణాబాయి, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు అజేయలక్ష్మి, మేడ్చల్ డిపో ఏఈ స్నేహలత, టీఎన్జీవో జనరల్ సెక్రటరీ కురుమూర్తి, జాయింట్ సెక్రటరీ ఆనంద రావు తదితరులు పాల్గొన్నారు.అనంతరం మహిళా వ్యవస్థాపకులు మరియు మహిళా సంఘాల ప్రతినిధులను సన్మానించారు. అలాగే వివిధ క్రీడా పోటీల్లో విజేతలైన మహిళలకు బహుమతులు ప్రదానం చేశారు.





## అభివృద్ధి లో మహిళల పాత్ర అమూల్యం

◆ 65 వ డివిజన్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు పోలేపాక అశోక్

**హసన్ పర్తి,మార్చి09(తెలంగాణ ముచ్చట్లు):** హన్మకొండ జిల్లా హసన్ పర్తి మండల పరిధిలోని గ్రేటర్ మున్సిపాలిటీ 65 వ డివిజన్ లోని పలు గ్రామాల లో ఆదివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా డివిజన్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు పోలేపాక అశోక్ ఆయా గ్రామాల మహిళలను శాలువాతో సన్మానించి వారిని అభినందించారు. అనంతరం పోలిపాక అశోక్ మాట్లాడుతూ మహిళలే కుటుంబానికి, సమాజానికి బలమని వారి త్యాగం, కృషి, ప్రతిభ వల్లే ప్రపంచం ముందుకు సాగుతుందన్నారు. ప్రతి మహిళా గౌరవంతో, సమాన హక్కులతో జీవించే సమాజాన్ని నిర్మించాలన్నారు. కుటుంబ, సమాజ అభివృద్ధి లో తమ బాధ్యతలను సమర్ధవంతంగా నిర్వహించాలని కోరారు.

ఈ కార్యక్రమంలో 65 వ డివిజన్ అధ్యక్షులు అయ్యల రామ్ రెడ్డి, వర్ధన్నపేట కాంగ్రెస్ యూత్ అధ్యక్షులు ఆవుల పవన్ కళ్యాణ్, దేవన్నపేట గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శ్రీపతి మల్లేశం, హసన్ పర్తి మండల యువ నాయకులు. లౌడియా తిరుపతి తండా ఇంద్రమ్మ కమిటీ మెంబర్, సుబ్బయ్య పల్లి గ్రామ కాంగ్రెస్ నాయకులు పుట్ట సురేందర్, వస్కుల చిరంజీవి, కొక్కిరాల రాజు, దేవన్నపేట మహిళా అధ్యక్షులు జన్ను పరంజ్యోతి, సందెల సరోజన, తదితరులు పాల్గొన్నారు.







## చైతన్య టెక్నో స్కూల్‌లో సప్తమ వార్షికోత్సవ వేడుకలు

**సత్తుపల్లి, మార్చి 9 (తెలంగాణ ముచ్చట్లు):** స్థానిక గుడిపాడు రోడ్‌లో ఉన్న చైతన్య టెక్నో స్కూల్‌లో సప్తమ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆషా స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకులు, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయకుమార్, సత్తుపల్లి మండల విద్యాధికారి ఎన్. రాజేశ్వరరావు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్షుడు నారాయణ వరపు శ్రీనివాసరావు, సత్తుపల్లి మున్సిపాలిటీ 15వ వార్డు కౌన్సిలర్ దూదిపాళ్ల రాంబాబు హాజరయ్యారు.

ఈ సందర్భంగా ఎస్ఎస్‌సీ-2025లో ప్రతిభ కనబర్చిన విద్యార్థుల తల్లిదండ్రులను ఘనంగా సన్మానించారు. ముఖ్య అతిథి డాక్టర్ దయానంద్ విజయకుమార్ మాట్లాడుతూ విద్యార్థులు పట్టుదలతో, శ్రద్ధతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఎప్పుడూ గౌరవించాలని అన్నారు. మండల విద్యాధికారి రాజేశ్వరరావు మాట్లాడుతూ ఉన్నత విద్యా ప్రమాణాలతో మంచి గుర్తింపు పొందిన విద్యాసంస్థగా ఎదిగినందుకు పాఠశాల యాజమాన్యాన్ని అభినందించారు. వార్షికోత్సవ వేడుకల్లో విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు తల్లిదండ్రులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వై. మురళీకృష్ణ, డైరెక్టర్లు ఆర్. సుజాత, ఆర్. రాకేష్, ఎం. రవికుమార్, వై. ఉషతో పాటు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# కూకట్‌పల్లిలో నల్ల చెరువు పునరుద్ధరణ ప్రారంభించిన సీఎం రేవంత్ రెడ్డి

- అభివృద్ధికి నిధులు ఇవ్వడానికి ప్రభుత్వం సిద్ధం
- ఆక్రమణల తొలగింపుతో నగరాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకెళ్తాం




**హైదరాబాద్, మార్చి 9 (తెలంగాణ ముచ్చట్లు):** మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కూకట్‌పల్లి లో పునరుద్ధరించిన నల్ల చెరువును ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారు. ముఖ్యమంత్రి హోదాలో మల్కాజ్‌గిరి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని కూకట్‌పల్లికి రావడం సంతోషంగా ఉందని ఆయన పేర్కొన్నారు. రాజకీయాలకు అతీతంగా మల్కాజ్‌గిరి పార్లమెంట్ పరిధిలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల అభివృద్ధికి నిధులు మంజూరు చేస్తామని స్పష్టం చేశారు.రాజకీయాలతో సంబంధం లేకుండా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లడమే తమ ప్రభుత్వ విధానమని సీఎం తెలిపారు. చెరువుల పునరుద్ధరణకు ప్రభుత్వం పూనుకున్నప్పుడు ఎన్నో విమర్శలు, ఆరోపణలు ఎదురైనా మౌనంగా భరించానని చెప్పారు. నల్ల చెరువు అభివృద్ధిని చూసి ప్రజల ముఖాల్లో కనిపిస్తున్న ఆనందం ఆ విమర్శలను ఆశీర్వాదాలుగా మార్చిందని వ్యాఖ్యానించారు.పేదవారిని ఇబ్బంది పెట్టడం లేదా ఇండ్లు కూలగొట్టడం ప్రభుత్వ ఉద్దేశం కాదని సీఎం స్పష్టం చేశారు. వరదల సమయంలో ప్రజలు ముంపు బాధితులుగా మారకుండా ఉండేందుకు చెరువులు, నాలాలను పునరుద్ధరించడం అవసరమని తెలిపారు. చెరువులు, నాలాలను ఆక్రమించుకున్న వారికి న్యాయం చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు.పునరుద్ధరించిన చెరువుల వద్ద మహిళలకు స్టాల్స్ ఏర్పాటు చేసే అవకాశాలు కల్పిస్తామని తెలిపారు. చిన్నారుల కోసం చెరువుల ఒడ్డున ఆటస్థలాలను కూడా అభివృద్ధి చేయాలని సూచించారు. నగరంలోని చెరువులన్నింటినీ పునరుద్ధరించి ప్రకృతిని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. దేశంలోని మహానగరాలు అనేక సమస్యలతో సతమతమవుతున్నాయని, హైదరాబాద్ నగరంలో చెరువులను సంరక్షిస్తూ అభివృద్ధిని కొనసాగించాల్సిన అవసరం ఉందన్నారు. మూసీ నది ప్రక్షాళనతో పాటు కోర్ అర్బన్ రీజియన్‌లోని చెరువులన్నీ పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. నాలాల ఆక్రమణలు తొలగించి రోడ్ల విస్తరణ చేపట్టి హైదరాబాద్‌ను మంచి నగరంగా తీర్చిదిద్దుతామని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. అభివృద్ధికి అవసరమైన నిధులు ఇవ్వడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని, అభివృద్ధిని అడ్డుకోకుండా ప్రజలు సహకరించాలని కోరారు. కష్టకాలంలో ఈ ప్రాంత ప్రజలు తనకు అండగా నిలిచారని గుర్తుచేసుకున్న సీఎం, ప్రజల సహకారంతో నగరాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళతానని తెలిపారు.





# విజయ్‌కు మరోసారి సీబీఐ నోటీసులు


- మరోసారి విచారణకు సమన్లు
- ఈ నెల 10న హాజరు కావాలని ఆదేశం
- ప్రచార సభలో జరిగిన ఘటనపై దర్యాప్తు



**ఢిల్లీ,** గత సంవత్సరం తమిళనాడులో చోటుచేసుకున్న కరూర్ తొక్కిసలాట ఘటనకు సంబంధించిన కేసులో ప్రముఖ సినీ నటుడు, తమిళగ వెట్రి కళగం పార్టీ అధినేత విజయ్‌కు కేంద్ర దర్యాప్తు సంస్థ మరోసారి నోటీసులు జారీ చేసింది. ఈ నెల 10న విచారణకు హాజరు కావాలని సమన్లలో పేర్కొంది. ఈ కేసులో భాగంగా ఇప్పటికే ఒకసారి విజయ్‌ను విచారించిన సీబీఐ, తాజాగా మరోసారి ప్రశ్నించేందుకు నిర్ణయం తీసుకుంది. గత సంవత్సరం సెప్టెంబర్ 27న కరూర్‌లో విజయ్ నిర్వహించిన ప్రచార సభలో భారీగా జనసందోహం ఏర్పడి తొక్కిసలాట జరిగింది. ఈ ఘటనలో మొత్తం 41 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటన దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారడంతో కేసును సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు కేంద్ర దర్యాప్తు సంస్థకు అప్పగించారు.
దర్యాప్తు ప్రక్రియలో భాగంగా జనవరి నెలలో రెండు సార్లు విజయ్‌ను విచారించారు. ఢిల్లీలోని సీబీఐ ప్రధాన కార్యాలయంలో అధికారులు అతడిని ప్రశ్నించారు. సభ నిర్వహణలో తీసుకున్న భద్రతా చర్యలు, జనసందోహ నియంత్రణ ఏర్పాట్లు వంటి అంశాలపై వివరాలు సేకరించారు. ఇప్పటివరకు సేకరించిన ఆధారాలపై మరిన్ని వివరాలు తెలుసుకునేందుకు విజయ్‌ను మరోసారి విచారణకు పిలిచినట్లు అధికారులు తెలిపారు. ప్రచార సభకు సంబంధించిన అనుమతులు, వేదిక ఏర్పాట్లు, పార్టీ నిర్వహణ విధానం, అలాగే తమిళనాడు ప్రభుత్వ పాత్రపై కూడా దర్యాప్తు కొనసాగిస్తున్నామని వెల్లడించారు.

# ఇరాన్‌కు రష్యా మద్దతు ప్రకటించిన పుతిన్

- పశ్చిమాసియాలో ఉద్రిక్తతల మధ్య కీలక ప్రకటన
- ఇరాన్ నూతన సుప్రీం లీడర్‌కు అభినందనలు
- రష్యా–ఇరాన్ వ్యూహాత్మక బంధం బలోపేతం



**మాస్కో:** పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తీవ్ర స్థాయికి చేరుతున్న నేపథ్యంలో రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఇరాన్‌కు తన మద్దతును ప్రకటించారు. ఇజ్రాయెల్ మరియు అమెరికాతో కొనసాగుతున్న ఘర్షణల సమయంలో మిత్రదేశమైన ఇరాన్‌కు రష్యా అండగా నిలుస్తుందని ఆయన స్పష్టం చేశారు. ఇరాన్ నూతన సుప్రీం లీడర్‌గా బాధ్యతలు చేపట్టిన ముజ్తబా ఖమేనీకి పుతిన్ అభినందనలు తెలిపారు. ప్రస్తుత సంక్షోభ పరిస్థితుల్లో దేశాన్ని సమర్థవంతంగా నడిపించగల నాయకత్వం ఆయనకు ఉందని ఆశాభావం వ్యక్తం చేశారు. సరిహద్దుల్లో ఎదురవుతున్న సాయుధ దురాక్రమణలను ఎదుర్కొనేందుకు ఇరాన్‌కు బలమైన నాయకత్వం అవసరమని పుతిన్ పేర్కొన్నారు. ఇటీవల ఇరాన్ మాజీ సుప్రీం లీడర్ ఖమేనీతో పాటు ఇతర అగ్రనేతల మరణంపై ఆయన తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. అంతర్జాతీయ ఆంక్షలు మరియు యుద్ధ పరిస్థితుల మధ్య రష్యా-ఇరాన్ మధ్య వ్యూహాత్మక బంధం మరింత బలపడుతున్నట్లు విశ్లేషకులు పేర్కొంటున్నారు. రష్యా ప్రకటించిన ఈ మద్దతు ఇరాన్‌కు అంతర్జాతీయ స్థాయిలో నైతిక బలాన్ని అందిస్తుందని అభిప్రాయపడుతున్నారు.

# తిరునల్లార్ శని క్షేత్రంలో ఘనంగా శని పేర్చి ఉత్సవాలు

- లక్షలాది భక్తులతో ఆలయం కిటకిట
- రెండు లక్షల మందికి ఉచిత అన్నప్రసాద వితరణ





**హైదరాబాద్, మార్చి 9 (తెలంగాణ ముచ్చట్లు):** తిరునల్లార్లోని ప్రసిద్ధ ధర్బరణ్యేశ్వర స్వామి ఆలయంలో శని పేర్చి పవిత్ర ఉత్సవాలు భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. కుంభ రాశి నుంచి మీన రాశికి శని గ్రహం మారిన సందర్భంగా ఈ నెల 6వ తేదీ నుంచి 45 రోజులపాటు ప్రత్యేక పూజలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలను ఆలయ అధికారులు నిర్వహిస్తున్నారు.ఉత్సవాల ప్రారంభం సందర్భంగా మార్చి 6, 7, 8 తేదీలలో సుమారు ఆరు లక్షల మంది భక్తులు ఆలయాన్ని దర్శించి శని భగవానుడికి ప్రత్యేక పూజలు చేశారు. ప్రతి రెండున్నర సంవత్సరాలకు ఒకసారి జరిగే ఈ శని పేర్చి ఉత్సవాలకు దేశం నలుమూలల నుంచి భక్తులు భారీగా తరలివచ్చి భక్తి పారవశ్యంతో పాల్గొన్నారు.ఆలయ 27వ పీఠాధిపతి శ్రీ లా శ్రీ కైలై మాసిలామణి దేశిక జ్ఞాన సంబంధ పరమాచార్య స్వామిగళ్ ఆశీర్వాదాలతో కార్యక్రమాలు వైభవంగా నిర్వహించబడుతున్నాయి. ఈ సందర్భంగా తులసమ్మ చారిటబుల్ ఫౌండేషన్ మరియు సోలిస్ ఐ హాస్పిటల్ చైర్మన్ నందనపాటి రాము ఆధ్వర్యంలో సుమారు రెండు లక్షల మంది భక్తులకు ఉచిత అన్నప్రసాద వితరణ నిర్వహించారు. భక్తులకు సేవ చేయాలనే ఉద్దేశంతో ఈ అన్నదాన కార్యక్రమాన్ని ఐదోసారి నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.అలాగే ఆలయంలో హోమాలు, శని భగవానుడికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించగా నందనపాటి రాము కుటుంబ సభ్యులు, సోలిస్ హాస్పిటల్ సిబ్బంది భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని ఆలయ ప్రధాన అర్చకులు శివ శ్రీ టి. రాజస్వామి నాథ శివాచార్యులు ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ కార్యక్రమంలో అరికపూడి గాంధీ, భీరం హరివర్ధన్ రెడ్డి, సైదిరెడ్డి, లక్ష్మీ సౌజన్య, ఇషితా రాణి, కొత్త రామారావు తదితరులు పాల్గొన్నారు.

## ఆడదానికి మాత్రమే పరువు?

ఈ ఆధునిక కాలంలో కూడా
అమ్మాయి అంటే
వంటగది పడకగది మధ్యే
ఆమె ప్రపంచమని
ఇంకా నమ్మే మనుషులు ఉన్నారు.

చదువు కోసం ఖర్చు పెట్టని తండ్రి,
పెళ్లి కోసం అప్పు తెచ్చి
ఆమె జీవితాన్నే తాకట్టు పెట్టే
ఈ సమాజం ఎంత వింత.

పుస్తకాలకు ఖర్చు పెట్టని చేతులే
పసుపు బొట్టుకు బరువు కడతాయి,
ఆమె కలల్ని కాదు,
ఆమె కట్నాన్ని లెక్కించే
లెక్కల సమాజం ఇది.

మహిళా దినోత్సవం నాడు
ఉపన్యాసాలు...
వాట్సాప్ స్టేటస్‌లు...
స్త్రీ శక్తి అని పెద్ద పెద్ద మాటలు...

కానీ ఇంట్లోకి అడుగుపెట్టగానే
నువ్వు ఆడదానివి అని
కట్టుబాట్ల గొలుసులు,
సంప్రదాయం పేరుతో
స్వేచ్ఛకి తాళాలు.

పరువు ఆచారం సంప్రదాయం...
ఈ మూడు పదాలు
అమ్మాయి మెడలోనే ఎందుకు
తగులుతాయి?

అబ్బాయిలకు పరువు లేదా?
అబ్బాయిలకు సంప్రదాయం లేదా?
అబ్బాయిల తప్పులు
స్వేచ్ఛగా తిరిగే గాలిలా,
అమ్మాయిల తప్పులు
జీవిత ఖైదులా ఎందుకు?

ఆమె నవ్వు కూడా
అనుమతితోనే రావాలి,
ఆమె మాట కూడా
గోడల మధ్యే ఉండాలి.

వాడి పేరే వారసత్వం
పొలాలు, పత్రాలు,
ఆమె పేరు మీద
పెళ్లి పల్లకీ, పరువు బరువా?

ఇద్దరు ఒకే వీర్యపు బొట్టునుంచి
మొలిచిన విత్తనాలే కదా,
ఇద్దరు ఒకే గర్భంలో
పెరిగిన ప్రాణాలే కదా.

వారసత్వం అనే మాటను
పురుషుడి జేబులో పెట్టి,
స్త్రీకి కేవలం
సంబంధాల చిరునామా ఇచ్చే
ఈ సమాజం న్యాయాన్ని తాకట్టు పెట్టి,
సంప్రదాయానికి కిరీటం పెట్టింది!

రెక్కలున్న పక్షిని
పంజరంలో పెట్టి
ఎగరలేదే అని
నవ్వే సమాజం ఇది.



~ బసడ సంపత్ యాదవ్



# జేవర్ అంతర్జాతీయ విమానాశ్రయానికి లైసెన్స్ అందజేసిన కేంద్ర మంత్రి

- డీజీసీఏ ఏరోడ్రోమ్ లైసెన్స్ స్వీకరించిన నోయిడా విమానాశ్రయం
- ఆసియాలో అతిపెద్ద విస్తీర్ణం కలిగిన విమానాశ్రయ ప్రాజెక్టు
- దేశ విమానయాన రంగ అభివృద్ధికి కీలక కేంద్రం

**న్యూఢిల్లీ):** నోయిడా అంతర్జాతీయ విమానాశ్రయం (జేవర్) త్వరలో కార్యకలాపాలు ప్రారంభించేందుకు సిద్ధమవుతున్న నేపథ్యంలో కేంద్ర పౌర విమానయాన మంత్రి రామ్ మోహన్ నాయుడు డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ నుంచి ఏరోడ్రోమ్ లైసెన్స్‌ను అధికారికంగా అందజేశారు. ఈ సందర్భంగా విమానాశ్రయ నిర్వాహకులతో సమావేశమై మిగిలిన ప్రక్రియలను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. జేవర్ అంతర్జాతీయ విమానాశ్రయం దేశంలోనే అత్యంత కీలకమైన విమానయాన ప్రాజెక్టుల్లో ఒకటిగా గుర్తింపు పొందిందని మంత్రి తెలిపారు. ఆసియాలోనే అతి పెద్ద విస్తీర్ణం కలిగిన విమానాశ్రయ ప్రాంతంగా ఇది రూపుదిద్దుకుంటోందని పేర్కొన్నారు. ఈ విమానాశ్రయాన్ని ప్రధాన విమానయాన కేంద్రంగా అభివృద్ధి చేస్తూ మెయింటెనెన్స్, రిపేర్ అండ్ ఓవర్‌హాల్ కేంద్రాలు, ఎయిర్ కార్గో సదుపాయాలను ఏర్పాటు చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. దీని ద్వారా దేశ విమానయాన రంగానికి కొత్త అవకాశాలు ఏర్పడతాయని చెప్పారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో భారత విమానయాన రంగం వేగంగా విస్తరిస్తోందని రామ్ మోహన్ నాయుడు పేర్కొన్నారు. ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేస్తూ దేశంలో కనెక్టివిటీని పెంచేందుకు ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని ఆయన అన్నారు.

# ఢిల్లీ నుంచి బయల్దేరిన విమానం యూటర్న్

- గగనతలాలు మూసివేతతో మార్గం మార్పు
- ఇథియోపియా ఆంక్షలతో వెనక్కి మళ్లిన విమానం
- ప్రయాణ పునఃప్రారంభంపై చర్చలు




**న్యూఢిల్లీ:** ఇరాన్, అమెరికా, ఇజ్రాయెల్ దేశాల మధ్య కొనసాగుతున్న ఉద్రిక్తతల కారణంగా పశ్చిమాసియాలో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ఈ నేపథ్యంలో ఇరాన్, ఇజ్రాయెల్‌తో పాటు పలు గల్ఫ్ దేశాలు తమ గగనతలాలను మూసివేయడంతో అంతర్జాతీయ విమాన సర్వీసులు ప్రభావితమవుతున్నాయి. ఈ పరిస్థితుల్లో ఢిల్లీ నుంచి మాంచెస్టర్‌కు బయల్దేరిన ఒక విమానం మధ్యలోనే యూటర్న్ తీసుకోవాల్సి వచ్చింది. విమానయాన సంస్థ తెలిపిన వివరాల ప్రకారం, సోమవారం తెల్లవారుజామున ఢిల్లీ నుంచి మాంచెస్టర్‌కు బయల్దేరిన ఇండిగో సంస్థకు చెందిన విమానం పశ్చిమాసియా గగనతలాలు మూసివేయడంతో ప్రత్యామ్నాయ మార్గాన్ని ఎంచుకుంది. గల్ఫ్ ఆఫ్ అడెన్ మరియు ఆఫ్రికా మీదుగా ప్రయాణిస్తూ దాదాపు ఏడు గంటల పాటు ప్రయాణించింది. ఇథియోపియా సరిహద్దులోకి ప్రవేశించే సమయంలో ఆ దేశ ప్రభుత్వం కూడా గగనతల ఆంక్షలు విధించింది. అప్పటికే విమానం మరో నాలుగు గంటల్లో మాంచెస్టర్ చేరుకునే దూరంలో ఉండగా చివరి నిమిషంలో ఆంక్షలు రావడంతో విమానాన్ని వెనక్కి మళ్లించాల్సి వచ్చినట్లు సంస్థ తెలిపింది.
ప్రస్తుతం ఈ విమాన ప్రయాణాన్ని తిరిగి ప్రారంభించే అవకాశాలపై సంబంధిత దేశాల అధికారులతో చర్చలు జరుపుతున్నట్లు ఇండిగో సంస్థ వెల్లడించింది. పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్తతల ప్రభావం అంతర్జాతీయ విమాన రవాణాపై కూడా పడుతున్నట్లు అధికారులు తెలిపారు.

# ఏసీల ధరలకు రెక్కలు.. వేసవికి ముందే పెరిగిన రేట్లు




**హైదరాబాద్:** ఈసారి వేసవి ఎండలు ముందుగానే ముదురుతుండటంతో ఎయిర్ కండిషనర్లకు డిమాండ్ ఒక్కసారిగా పెరిగింది. దీనిని ఆసరాగా చేసుకుని తయారీ కంపెనీలు ఏసీల ధరలను పెంచాయి. వేసవి సీజన్‌కు ముందే ధరలు పెరగడం వినియోగదారులను ఆందోళనకు గురి చేస్తోంది. ముడిసరుకులైన రాగి, అల్యూమినియం ధరలు పెరగడం వల్ల తయారీ ఖర్చులు గణనీయంగా పెరిగాయని కంపెనీలు చెబుతున్నాయి. అదనంగా విదేశాల నుంచి దిగుమతి చేసే విడిభాగాల ఖర్చు పెరగడం, రూపాయి విలువ తగ్గడం కూడా ధరల పెరుగుదలకు కారణమయ్యాయి. అంతర్జాతీయంగా నెలకొన్న యుద్ధ వాతావరణం కారణంగా సరఫరా గొలుసులో అంతరాయం ఏర్పడి ఖర్చులు పెరిగినట్లు పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి.
మార్కెట్లో ఉన్న ప్రముఖ బ్రాండ్‌లు ఇప్పటికే ధరలను పెంచడం ప్రారంభించాయి. డైకిన్, వోల్టాస్, ఎల్‌జీ వంటి కంపెనీలు తమ ఏసీల ధరలను సుమారు 7 శాతం నుంచి 15 శాతం వరకు పెంచినట్లు సమాచారం. మరోవైపు కొత్త ఎనర్జీ రేటింగ్ నిబంధనల కారణంగా తయారీలో మార్పులు రావడంతో కూడా ధరలు పెరిగినట్లు పరిశ్రమ వర్గాలు వెల్లడిస్తున్నాయి. దీంతో ఈ వేసవిలో ఏసీ కొనుగోలు చేయాలనుకునే వారికి గతంతో పోలిస్తే ఎక్కువ ఖర్చు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది2.




# స్వేచ్ఛ కోసం టిబెట్ ప్రజల చారిత్రక పోరాటం

**చైనా పాలనకు వ్యతిరేకంగా భారీ ప్రజా ఉద్యమం**

**ప్రపంచవ్యాప్తంగా టిబెట్ ప్రజల ఐక్యతకు ప్రతీక**

టిబెట్ ప్రజలు తమ స్వేచ్ఛ, స్వయం పాలన కోసం చేసిన చారిత్రక పోరాటాన్ని గుర్తుచేసుకుంటూ ప్రతి సంవత్సరం మార్చి 10న టిబెట్ తిరుగుబాటు దినాన్ని నిర్వహిస్తున్నారు. టిబెట్ చరిత్రలో ఈ రోజు ఒక కీలక మలుపుగా నిలిచింది. తమ సంస్కృతి, సంప్రదాయాలు, ఆధ్యాత్మిక వారసత్వాన్ని కాపాడుకోవడానికి టిబెట్ ప్రజలు చేసిన పోరాటాన్ని ఈ రోజు ప్రపంచానికి గుర్తుచేస్తుంది. ఈ దినాన్ని టిబెట్ ప్రజలు మాత్రమే కాకుండా ప్రపంచవ్యాప్తంగా ఉన్న అనేక మానవ హక్కుల సంస్థలు కూడా గుర్తిస్తూ కార్యక్రమాలు నిర్వహిస్తుంటాయి. 1959లో టిబెట్ రాజధాని లాసాలో పెద్ద ఎత్తున ప్రజా తిరుగుబాటు జరిగింది. ఆ సమయంలో చైనా పాలనపై అసంతృప్తి వ్యక్తం చేసిన వేలాది మంది టిబెట్ ప్రజలు వీధుల్లోకి వచ్చి నిరసనలు చేపట్టారు. తమ భూమిపై స్వయం పాలన కొనసాగాలని, తమ సంస్కృతికి గౌరవం కల్పించాలని వారు డిమాండ్ చేశారు. ఈ నిరసనలు త్వరగా పెద్ద ఉద్యమంగా మారాయి. అయితే చైనా సైన్యం ఈ ఉద్యమాన్ని అణిచివేసేందుకు కఠిన చర్యలు తీసుకుంది. ఈ సంఘటనలు టిబెట్ చరిత్రలో అత్యంత ఉద్రిక్త పరిస్థితులను సృష్టించాయి. ఈ తిరుగుబాటు తరువాత టిబెట్ ఆధ్యాత్మిక నాయకుడు దలైలామా దేశం విడిచి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఆయన భారతదేశానికి చేరుకొని ఆశ్రయం పొందారు. అప్పటి నుంచి టిబెట్ ప్రజల ఒక పెద్ద వర్గం విదేశాల్లో నివసిస్తూ తమ సంస్కృతి, సంప్రదాయాలను కొనసాగిస్తోంది. భారతదేశంలో కూడా టిబెట్ శరణార్థులు అనేక ప్రాంతాలలో నివసిస్తూ తమ జీవన విధానాన్ని కొనసాగిస్తున్నారు. వారు తమ మాతృభూమి పట్ల ప్రేమను, స్వేచ్ఛపై ఉన్న ఆశలను ఎప్పటికీ మర్చిపోలేదని చెబుతున్నారు. టిబెట్ సమస్య అంతర్జాతీయ స్థాయిలో కూడా అనేక సంవత్సరాలుగా చర్చనీయాంశంగా కొనసాగుతోంది. టిబెట్ ప్రజల హక్కులు, స్వేచ్ఛ, సంస్కృతి పరిరక్షణ వంటి అంశాలపై ప్రపంచవ్యాప్తంగా చర్చలు జరుగుతున్నాయి. అనేక మానవ హక్కుల సంస్థలు టిబెట్ ప్రజల పరిస్థితిపై ఆందోళన వ్యక్తం చేస్తుంటాయి. టిబెట్ ప్రజల ఆత్మగౌరవాన్ని కాపాడటానికి శాంతియుత మార్గాల్లో సమస్యకు పరిష్కారం కనుగొనాలని పిలుపునిస్తున్నారు. టిబెట్ తిరుగుబాటు దినం సందర్భంగా ప్రపంచవ్యాప్తంగా వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తారు. శాంతి ర్యాలీలు, చర్చలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తూ టిబెట్ ప్రజల పోరాటాన్ని గుర్తుచేస్తారు. ఈ కార్యక్రమాల ద్వారా ప్రపంచానికి టిబెట్ చరిత్రను పరిచయం చేస్తూ వారి సమస్యలపై అవగాహన పెంచుతున్నారు. టిబెట్ ప్రజలు తమ ఐక్యతను ప్రదర్శిస్తూ స్వేచ్ఛపై ఉన్న తమ ఆశలను వ్యక్తం చేస్తారు. ఈ దినం టిబెట్ ప్రజల ధైర్యం, సంకల్పానికి ప్రతీకగా నిలుస్తోంది. తమ స్వాతంత్ర్యం, సంస్కృతి, ఆధ్యాత్మిక సంప్రదాయాలను కాపాడుకోవాలనే సంకల్పం వారికి ఎంతో బలంగా ఉందని ఈ రోజు గుర్తుచేస్తుంది. టిబెట్ తిరుగుబాటు దినం కేవలం ఒక చారిత్రక సంఘటనను గుర్తు చేసే రోజు మాత్రమే కాదు, స్వేచ్ఛ కోసం ప్రజలు చేసిన పోరాటానికి ప్రతీకగా నిలిచే రోజు కూడా. ప్రపంచవ్యాప్తంగా ఉన్న టిబెట్ ప్రజలు ఈ రోజును తమ ఐక్యత, ఆశయాలకు ప్రతీకగా జరుపుకుంటూ భవిష్యత్తుపై ఆశను వ్యక్తం చేస్తున్నారు.

## టెక్ మహీంద్రాలో 30వేల లేఆఫ్‌లంటూ వార్తలు.. స్పందించిన కంపెనీ




ప్రముఖ ఐటీ సంస్థ టెక్ మహీంద్రా భారీఎత్తున ఉద్యోగుల తొలగింపులు చేపట్టనున్నట్లు కొన్నిరోజులుగా ప్రచారం జరుగుతోంది. దాదాపు 30వేల మందికి లేఆఫ్‌లు ఇవ్వనున్నట్లు ఓ వార్త సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. దీనిపై కంపెనీ తాజాగా స్పందించింది. అవన్నీ అసత్య కథనాలంటూ లేఆఫ్‌లను తోసిపుచ్చింది. ఈ మేరకు స్టాక్ ఎక్స్ఛేంజీ ఫైలింగ్‌లో సోమవారం స్పష్టతనిచ్చింది. “మా కంపెనీలో ఉద్యోగుల కోతలకు సంబంధించి సోషల్ మీడియాలో వైరల్ అవుతోన్న వార్త మా దృష్టికి వచ్చింది. దీనిపై మాకు కాల్స్ కూడా వస్తున్నాయి. దీంతో ఈ ఊహాగానాలపై స్పందించాల్సిన అవసరం ఉందని భావించాం. ఉద్యోగుల తొలగింపులకు సంబంధించి ప్రస్తుతానికి ఎలాంటి ప్రతిపాదనలను పరిగణించట్లేదు. లేఆఫ్‌లపై ఇలాంటి అసత్య ప్రచారాన్ని మేం తోసిపుచ్చుతున్నాం” అని టెక్ మహీంద్రా కంపెనీ వెల్లడించింది. ఏజెంటిక్ ఏఐ ప్లాట్‌ఫామ్‌ను తీసుకొచ్చేందుకు మైక్రోసాఫ్ట్‌తో కలిసి పనిచేస్తున్నట్లు టెక్ మహీంద్రా ఇటీవల ప్రకటించింది. ఈ నేపథ్యంలోనే ఈ లేఆఫ్‌ల ప్రచారం మొదలైంది. ఈ కంపెనీ రానున్న నెలల్లో తమ ఉద్యోగుల సంఖ్యను 30వేల మేర తగ్గించనున్నట్లు సోషల్ మీడియాలో పోస్టులు వెల్లువెత్తాయి. కృత్రిమ మేధ పురోగతితో ప్రపంచవ్యాప్తంగా టెక్ కంపెనీలపై ప్రతికూల ప్రభావం పడుతోన్న వేళ ఈ ప్రచారం ఐటీ రంగంలో ఆందోళనలు రేకెత్తించింది. ఈ నేపథ్యంలో కంపెనీ స్పష్టతనిచ్చింది. కాగా.. ప్రస్తుతం టెక్ మహీంద్రాకు ప్రపంచవ్యాప్తంగా 1.5 లక్షల మంది ఉద్యోగులు ఉన్నట్లు ఇటీవల విడుదలైన త్రైమాసిక ఫలితాల్లో వెల్లడైంది. గత త్రైమాసికంలో ఎవరినీ ఉద్యోగం నుంచి తొలగించలేదని ఈ సంస్థ మేనేజ్‌మెంట్ ప్రకటించింది.





# న్యాయ వ్యవస్థలో మహిళల ప్రతిభకు గౌరవం

**సమానత్వం కోసం అంతర్జాతీయ స్థాయిలో అవగాహన**

**న్యాయరంగంలో మహిళలు ముందుకు రావాలని పిలుపు**

ప్రపంచవ్యాప్తంగా న్యాయ వ్యవస్థలో మహిళలు పోషిస్తున్న కీలక పాత్రను గుర్తిస్తూ ప్రతి సంవత్సరం మార్చి 10న అంతర్జాతీయ మహిళా న్యాయమూర్తుల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. సమాజంలో న్యాయం నిలబెట్టడంలో న్యాయమూర్తుల పాత్ర ఎంత ముఖ్యమో అందరికీ తెలిసిందే. అదే విధంగా మహిళా న్యాయమూర్తులు కూడా తమ ప్రతిభ, నిబద్ధతతో న్యాయ వ్యవస్థను బలపరుస్తున్నారు. ఈ నేపథ్యంలో మహిళలు న్యాయ రంగంలో అందిస్తున్న సేవలను గౌరవించడం, మరింత మంది మహిళలు ఈ రంగంలోకి రావాలని ప్రోత్సహించడం ఈ దినోత్సవం ప్రధాన ఉద్దేశంగా భావిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా న్యాయ వ్యవస్థలో లింగ సమానత్వాన్ని సాధించాలనే లక్ష్యంతో ఈ ప్రత్యేక దినాన్ని నిర్వహిస్తున్నారు. అంతర్జాతీయ మహిళా న్యాయమూర్తుల దినోత్సవాన్ని ఐక్యరాజ్యసమితి సాధారణ సభ అధికారికంగా ప్రకటించింది. న్యాయ రంగంలో మహిళల ప్రాతినిధ్యం పెరగాలని, మహిళలు కూడా ఉన్నత స్థానాల్లో పనిచేసే అవకాశాలు పొందాలని అంతర్జాతీయ సమాజం కోరుకుంటోంది. చాలా దేశాలలో ఇప్పటికీ న్యాయ వ్యవస్థలో మహిళల సంఖ్య తక్కువగానే ఉంది. న్యాయస్థానాల్లో ఉన్నత స్థానాల్లో మహిళలు తక్కువగా ఉండటం గమనార్హం. ఈ పరిస్థితిని మార్చేందుకు అవగాహన పెంచడం అవసరమని నిపుణులు భావిస్తున్నారు. మహిళలకు సమాన అవకాశాలు కల్పించడం ద్వారా న్యాయ వ్యవస్థ మరింత సమగ్రంగా మారుతుందని అభిప్రాయపడుతున్నారు. భారతదేశంలో కూడా మహిళలు న్యాయ రంగంలో విశేషమైన సేవలు అందిస్తున్నారు. జిల్లా కోర్టుల నుంచి ఉన్నత న్యాయస్థానాల వరకు మహిళా న్యాయమూర్తులు తమ ప్రతిభను నిరూపిస్తున్నారు. గత కొన్నేళ్లలో మహిళల ప్రాతినిధ్యం కొంతవరకు పెరిగినా, ఇంకా ఎక్కువ అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందని న్యాయ నిపుణులు సూచిస్తున్నారు. మహిళలు న్యాయరంగంలో ముందుకు రావడం వల్ల సమాజంలో న్యాయం మరింత బలపడుతుంది. మహిళలు ఎదుర్కొనే సమస్యలను లోతుగా అర్థం చేసుకునే సామర్థ్యం మహిళా న్యాయమూర్తుల్లో ఎక్కువగా ఉంటుందని కూడా కొందరు విశ్లేషకులు చెబుతున్నారు. అంతర్జాతీయ మహిళా న్యాయమూర్తుల దినోత్సవం సందర్భంగా ప్రపంచవ్యాప్తంగా పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. న్యాయరంగంలో మహిళల పాత్రపై సదస్సులు, చర్చలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా యువతలో ఆసక్తిని పెంచుతున్నారు. న్యాయ విద్యను అభ్యసిస్తున్న యువతులు ఈ రంగంలోకి రావాలని ప్రోత్సహిస్తున్నారు. న్యాయ వ్యవస్థలో మహిళల సంఖ్య పెరిగితే సమాజంలో సమానత్వం మరింత బలపడుతుందని నిపుణులు పేర్కొంటున్నారు.

ఇప్పటి సమాజంలో మహిళలు అన్ని రంగాల్లో ముందుకు సాగుతున్నారు. విజ్ఞానం, సాంకేతికత, రాజకీయాలు, వ్యాపారం వంటి అనేక రంగాలలో మహిళలు తమ ప్రతిభను నిరూపిస్తున్నారు. అదే విధంగా న్యాయ రంగంలో కూడా మహిళలు తమ ప్రతిభను చాటుతూ కీలక బాధ్యతలను నిర్వర్తిస్తున్నారు. మహిళలు న్యాయ వ్యవస్థలో ఉన్నత స్థానాలకు చేరుకోవడం ద్వారా సమాజానికి స్ఫూర్తిగా నిలుస్తున్నారు. వారి కృషి వల్ల న్యాయ వ్యవస్థపై ప్రజల్లో విశ్వాసం మరింత పెరుగుతుందని నిపుణులు పేర్కొంటున్నారు. మొత్తంగా చూస్తే అంతర్జాతీయ మహిళా న్యాయమూర్తుల దినోత్సవం మహిళల ప్రతిభను గుర్తించడమే కాకుండా సమానత్వానికి మార్గం చూపించే రోజు అని చెప్పవచ్చు. న్యాయ వ్యవస్థలో మహిళలకు సమాన అవకాశాలు కల్పించడం ద్వారా సమాజంలో న్యాయం మరింత బలపడుతుంది. ఈ దినోత్సవం మహిళలు న్యాయరంగంలో ముందుకు రావాలని ప్రోత్సహిస్తూ, సమానత్వం సాధనకు ఒక ముఖ్యమైన అడుగుగా నిలుస్తోంది. ఈ దినోత్సవాన్ని ఐక్యరాజ్యసమితి సాధారణ సభ 2021లో అధికారికంగా ప్రకటించింది. ప్రపంచ దేశాలలో న్యాయ వ్యవస్థలో మహిళల సంఖ్యను పెంచడం, సమానత్వాన్ని సాధించడం కోసం అవగాహన పెంచాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకుంది. చాలా దేశాల్లో ఇప్పటికీ న్యాయ వ్యవస్థలో మహిళల ప్రాతినిధ్యం తక్కువగా ఉండటం గమనార్హం. ఈ నేపథ్యంలో మహిళలు కూడా న్యాయ రంగంలో ముందుకు రావాలని ప్రోత్సహించడం ముఖ్యంగా భావిస్తున్నారు.


భారతదేశంలో కూడా మహిళా న్యాయమూర్తులు అనేక స్థాయిల్లో సేవలందిస్తున్నారు. జిల్లా కోర్టుల నుండి ఉన్నత న్యాయస్థానాల వరకు మహిళలు తమ ప్రతిభను చాటుతున్నారు. న్యాయ వ్యవస్థలో మహిళల ప్రాతినిధ్యం పెరగడం వల్ల సమాజంలో సమానత్వం, న్యాయం మరింత బలపడుతుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. మహిళలు ఎదుర్కొనే సమస్యలను అర్థం చేసుకుని సరైన తీర్పులు ఇవ్వడంలో మహిళా న్యాయమూర్తుల పాత్ర ముఖ్యమని చెబుతున్నారు.

అంతర్జాతీయ మహిళా న్యాయమూర్తుల దినోత్సవం సందర్భంగా ప్రపంచవ్యాప్తంగా పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. సదస్సులు, చర్చలు, అవగాహన కార్యక్రమాల ద్వారా మహిళలు న్యాయ రంగంలో మరింతగా ముందుకు రావాలని పిలుపునిస్తున్నారు. న్యాయ వ్యవస్థలో లింగ సమానత్వం సాధించడం ద్వారా సమాజంలో న్యాయం మరింత బలపడుతుందని న్యాయ నిపుణులు సూచిస్తున్నారు.

# దేశ అభివృద్ధికి భద్రతా కవచం

దేశ ఆర్థిక అభివృద్ధికి మూలస్తంభాలుగా నిలిచే పరిశ్రమలు, విమానాశ్రయాలు, కీలక సంస్థలకు భద్రత కల్పించేందుకు ఏర్పాటైన కేంద్ర పారిశ్రామిక భద్రతా దళం భారత భద్రతా వ్యవస్థలో ఒక కీలక స్థానం సంపాదించింది. ప్రతి సంవత్సరం మార్చి 10న ఈ దళం స్థాపనా దినోత్సవాన్ని గుర్తుచేసుకుంటారు. దేశంలోని ముఖ్యమైన పారిశ్రామిక సంస్థలు సురక్షితంగా పనిచేయడానికి, వాటిపై ఎలాంటి భద్రతా ముప్పులు తలెత్తకుండా ఉండేందుకు ఈ దళం కీలక పాత్ర పోషిస్తోంది. పరిశ్రమలు మాత్రమే కాకుండా విమానాశ్రయాలు, అణు విద్యుత్ కేంద్రాలు, అంతరిక్ష పరిశోధన సంస్థలు, మెట్రో రైలు కేంద్రాలు వంటి అత్యంత ప్రాధాన్యత గల ప్రదేశాలకు కూడా ఈ దళం భద్రత అందిస్తోంది. భారతదేశంలో పారిశ్రామిక రంగం వేగంగా అభివృద్ధి చెందుతున్న సమయంలో వాటి భద్రత కోసం ప్రత్యేక దళం అవసరం ఉందనే ఆలోచనతో కేంద్ర పారిశ్రామిక భద్రతా దళాన్ని ఏర్పాటు చేశారు. 1969లో ఈ దళం ఏర్పడింది. ప్రారంభంలో కొన్ని ముఖ్యమైన పరిశ్రమలకు మాత్రమే భద్రత కల్పించే బాధ్యత ఈ దళానికి ఉండేది. కానీ కాలక్రమేణా దేశంలో పరిశ్రమల సంఖ్య పెరగడం, విమానాశ్రయాలు మరియు ఇతర కీలక వ్యవస్థల ప్రాముఖ్యత పెరగడం వల్ల ఈ దళం బాధ్యతలు కూడా విస్తరించాయి. ప్రస్తుతం దేశవ్యాప్తంగా అనేక ముఖ్యమైన సంస్థలకు ఈ దళం భద్రతా సేవలను అందిస్తోంది. విమానాశ్రయాల్లో ప్రయాణికుల భద్రతను కాపాడటంలో ఈ దళం కీలక పాత్ర పోషిస్తోంది. ప్రతి రోజు లక్షలాది మంది ప్రయాణికులు విమాన ప్రయాణం చేసే సందర్భంలో భద్రతా ప్రమాణాలను కచ్చితంగా అమలు చేయడం ఎంతో అవసరం. ఈ నేపథ్యంలో ప్రయాణికుల తనిఖీలు, సామగ్రి పరిశీలన, అనుమానాస్పద కార్యకలాపాలపై నిఘా వంటి అనేక బాధ్యతలను ఈ దళం సమర్థంగా నిర్వహిస్తోంది. అంతేకాకుండా పరిశ్రమల వద్ద యంత్రాలు, ఆస్తులు, సిబ్బందికి భద్రత కల్పించడం ద్వారా దేశ ఆర్థిక వ్యవస్థకు రక్షణ కల్పిస్తోంది. ఆధునిక కాలంలో భద్రతా సవాళ్లు కూడా మారుతున్నాయి. ఉగ్రవాదం, విధ్వంసక చర్యలు, సాంకేతిక దాడులు వంటి అనేక ముప్పులు ఎదురవుతున్న నేపథ్యంలో భద్రతా వ్యవస్థను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉంది. ఈ నేపథ్యంలో కేంద్ర పారిశ్రామిక భద్రతా దళం ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగిస్తూ భద్రతా ప్రమాణాలను పెంచుతోంది. నూతన పరికరాలు, నిఘా వ్యవస్థలు, ప్రత్యేక శిక్షణల ద్వారా సిబ్బందిని మరింత సమర్థులుగా తయారు చేస్తున్నారు. కేంద్ర పారిశ్రామిక భద్రతా దళం సేవలు కేవలం భద్రతకు మాత్రమే పరిమితం కావడం లేదు. అత్యవసర పరిస్థితుల్లో సహాయక చర్యలు చేపట్టడంలో కూడా ఈ దళం ముందుంటోంది. అగ్నిప్రమాదాలు, ప్రమాదకర సంఘటనలు వంటి సందర్భాల్లో వెంటనే స్పందించి ప్రజలను రక్షించడంలో ఈ దళం పాత్ర కీలకంగా ఉంటుంది. పరిశ్రమలు, ప్రజల ప్రాణాలు, ఆస్తులను కాపాడడంలో ఈ దళం చేస్తున్న సేవలు దేశ ప్రజల్లో విశ్వాసాన్ని పెంచుతున్నాయి. దేశ అభివృద్ధి నిరంతరం కొనసాగాలంటే పరిశ్రమలు, సంస్థలు సురక్షితంగా పనిచేయడం అత్యంత అవసరం. ఈ బాధ్యతను నిబద్ధతతో నిర్వర్తిస్తూ కేంద్ర పారిశ్రామిక భద్రతా దళం దేశానికి ఒక భద్రతా కవచంలా నిలుస్తోంది. సాంకేతిక పరిజ్ఞానం, శిక్షణ, క్రమశిక్షణతో ముందుకు సాగుతున్న ఈ దళం సేవలు దేశ భద్రతా వ్యవస్థను మరింత బలోపేతం చేస్తున్నాయి. స్థాపనా దినోత్సవం సందర్భంగా ఈ దళం చేస్తున్న సేవలను గుర్తుచేసుకోవడం మాత్రమే కాకుండా భవిష్యత్తులో కూడా ఈ దళం దేశ అభివృద్ధికి అండగా నిలుస్తుందనే విశ్వాసం వ్యక్తమవుతోంది. దేశంలో పారిశ్రామిక అభివృద్ధి వేగంగా జరుగుతున్న సమయంలో వాటికి భద్రత కల్పించేందుకు ప్రత్యేక దళం అవసరం ఉందనే ఆలోచనతో కేంద్ర పారిశ్రామిక భద్రతా దళాన్ని ఏర్పాటు చేశారు. 1969లో స్థాపించబడిన ఈ దళం ప్రారంభంలో కొన్ని పరిశ్రమలకు మాత్రమే భద్రత అందించేది. కాలక్రమేణా దేశంలోని అనేక కీలక సంస్థలకు ఈ దళం సేవలు విస్తరించాయి. ప్రస్తుతం విమానాశ్రయాలు, అణు విద్యుత్ కేంద్రాలు, అంతరిక్ష పరిశోధన సంస్థలు, మెట్రో రైలు కేంద్రాలు వంటి అనేక ప్రదేశాలకు ఈ దళం భద్రత కల్పిస్తోంది. ప్రస్తుతం కేంద్ర పారిశ్రామిక భద్రతా దళం దేశ భద్రతలో ఒక ముఖ్యమైన స్థానం సంపాదించింది. అత్యాధునిక సాంకేతికతను ఉపయోగిస్తూ భద్రతా విధుల్లో నిబద్ధతతో పనిచేస్తోంది. విమానాశ్రయాల్లో ప్రయాణికుల భద్రత, పరిశ్రమల వద్ద ఆస్తి రక్షణ, అత్యవసర పరిస్థితుల్లో సమర్థంగా స్పందించడం వంటి అనేక బాధ్యతలను ఈ దళం నిర్వహిస్తోంది. దేశ అభివృద్ధికి అవసరమైన కీలక వ్యవస్థలను కాపాడడంలో ఈ దళం చేస్తున్న సేవలు ప్రశంసనీయమైనవిగా భావించబడుతున్నాయి. కాలానుగుణంగా భద్రతా సవాళ్లు మారుతున్న నేపథ్యంలో కేంద్ర పారిశ్రామిక భద్రతా దళం కూడా తన సామర్థ్యాలను పెంచుకుంటూ ముందుకు సాగుతోంది. శిక్షణ, సాంకేతిక పరిజ్ఞానం, ఆధునిక పరికరాల వినియోగం ద్వారా భద్రతా ప్రమాణాలను మరింత బలపరుస్తోంది. దేశ ఆర్థిక వ్యవస్థకు ప్రాణాధారమైన పరిశ్రమలు, సంస్థలను రక్షించడంలో ఈ దళం చేస్తున్న సేవలు దేశ ప్రజల్లో విశ్వాసాన్ని పెంచుతున్నాయి. స్థాపనా దినోత్సవం ఈ దళం సేవలను గుర్తుచేసే ఒక ముఖ్యమైన సందర్భంగా నిలుస్తోంది.


తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక




# విజయ్–రష్మిక జోడీతో మాన్యవర్ వెడ్డింగ్ క్యాంపెయిన్..


**72 గంటల్లోనే 100 మిలియన్ల వ్యూస్**

రానున్న పెళ్లి సీజన్‌ను దృష్టిలో పెట్టుకుని ప్రముఖ ఎథ్నిక్ వేర్ బ్రాండ్ మాన్యవర్–మోహె కొత్త ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఇటీవల వివాహ బంధంలోకి అడుగుపెట్టిన టాలీవుడ్ జంట విజయ్ దేవరకొండ, రష్మిక మందన్నాతో రూపొందించిన ఈ క్యాంపెయిన్ డిజిటల్ ప్రపంచంలో భారీ స్పందన అందుకుంటోంది. ప్రచార్ కమ్యూనికేషన్ రూపొందించిన ఈ ప్రకటన సోషల్ మీడియా వేదికలపై వైరల్‌గా మారింది. ఆధునిక వివాహ వేడుకల భావోద్వేగాలు, ఆనందాన్ని ప్రతిబింబించేలా ప్రత్యేకమైన కాన్సెప్ట్‌తో ఈ ప్రచార కార్యక్రమాన్ని రూపొందించారు. ఈ క్యాంపెయిన్ ప్రారంభమైన మూడు రోజుల్లోనే విజయ్ దేవరకొండ, రష్మిక మందన్నా కలిసి కనిపించిన ఒక స్టిల్‌కు ఇన్‌స్టాగ్రామ్‌లోనే 100 మిలియన్లకు పైగా వ్యూస్ వచ్చాయి. దాదాపు 8 మిలియన్లకు పైగా ఆర్గానిక్ లైక్స్ నమోదయ్యాయి. ఇతర సోషల్ మీడియా వేదికలను కలిపి చూస్తే ఈ ప్రచార కార్యక్రమం ఇప్పటివరకు 300 మిలియన్లకు పైగా వ్యూస్ సాధించడంతో పాటు 250 మిలియన్ల మంది యూజర్లను చేరుకుంది. పోస్ట్ ఎంగేజ్‌మెంట్ విషయానికి వస్తే 4 లక్షలకు పైగా షేర్లు, 65 వేలకుపైగా రీపోస్టులు, దాదాపు 29,500కు పైగా కామెంట్లు వచ్చినట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రస్తుతం ఈ క్యాంపెయిన్ డిజిటల్ మరియు సోషల్ మీడియా వేదికలపైనే కొనసాగుతుండగా త్వరలోనే సినిమా థియేటర్లు, ప్రింట్ మరియు అవుట్‌డోర్ మీడియాల్లో కూడా ప్రచారం విస్తరించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ప్రచార్ కమ్యూనికేషన్ డైరెక్టర్ రక్షిత్ జైన్ మాట్లాడుతూ కేవలం మూడు రోజుల్లోనే ఈ క్యాంపెయిన్ ఆలోచన నుంచి పూర్తయ్యే వరకు వేగంగా పని చేయడం సాధ్యమైందని చెప్పారు. మాన్యవర్‌తో దశాబ్దకాలంగా ఉన్న సంబంధం వల్లే ఈ ప్రాజెక్ట్‌ను తక్కువ సమయంలో పూర్తి చేయగలిగామని తెలిపారు. విజయ్ దేవరకొండ, రష్మిక మందన్నా జంటకు ప్రేక్షకుల నుంచి తమ ఊహించిన దానికంటే ఎక్కువ స్పందన లభించిందని పేర్కొన్నారు. రష్మిక మందన్నా మాట్లాడుతూ మాన్యవర్–మోహె బ్రాండ్ వివాహాలను భావోద్వేగాలతో చూపించే విధానం ఎంతో ప్రత్యేకమని చెప్పారు. ఈ కలెక్షన్‌లోని దుస్తులు అందంగా ఉండటంతో పాటు అద్భుతమైన నైపుణ్యాన్ని ప్రతిబింబిస్తున్నాయని తెలిపారు. విజయ్ దేవరకొండ మాట్లాడుతూ ఈ క్యాంపెయిన్ సంబంధాల అసలైన భావాన్ని చూపిస్తుందని అన్నారు. కాన్సెప్ట్, సంగీతం, దుస్తులు అన్నీ కలిసి సంప్రదాయం మరియు ఆధునికతను కలగలిపేలా రూపొందించారని తెలిపారు.




# 'రామాయణం'పై సోషల్ మీడియాలో కొత్త చర్చ.. రణబీర్, సాయి పల్లవి ఫోటో వైరల్

భారతీయ సినీ పరిశ్రమలో అత్యంత భారీ అంచనాలు నెలకొన్న ప్రాజెక్టుల్లో దర్శకుడు నితీష్ తివారి తెరకెక్కిస్తున్న 'రామాయణం' చిత్రం ఒకటి. బాలీవుడ్ స్టార్ రణబీర్ కపూర్ శ్రీరాముడి పాత్రలో, నటి సాయి పల్లవి సీతాదేవి పాత్రలో నటిస్తున్న ఈ సినిమా ఇప్పటికే దేశవ్యాప్తంగా ఆసక్తిని రేకెత్తిస్తోంది. తాజాగా సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఒక ఫోటో ఈ సినిమాపై కొత్త చర్చకు దారి తీసింది. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఆ ఫోటోలో రణబీర్ కపూర్ పక్కన సాయి పల్లవి కనిపిస్తోంది. ఈ చిత్రాన్ని చూసిన కొందరు నెటిజన్లు సాయి పల్లవి సీత పాత్రకు సరిపోలేదని విమర్శలు చేస్తున్నారు. ముఖ్యంగా ఆమె లుక్ ఆ పాత్రకు అనుగుణంగా లేదని సోషల్ మీడియాలో కామెంట్లు చేస్తున్నారు. దీంతో ఈ ఫోటో చుట్టూ పెద్ద ఎత్తున చర్చ మొదలైంది. అయితే మరోవైపు ఈ ఫోటో నిజంగా సినిమా నుంచి లీక్ కాలేదని, అది కృత్రిమ మేధస్సు సాయంతో రూపొందించిన చిత్రం కావచ్చని కొందరు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతం కృత్రిమ మేధస్సు సాంకేతికత వేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న చిత్రాలు నిజమా కాదా అన్న సందేహాలు ఎక్కువగా వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో వైరల్ అవుతున్న ఆ ఫోటో అసలు సినిమా షూటింగ్‌కు సంబంధించినది కాకపోవచ్చని సినీ వర్గాలు భావిస్తున్నాయి. ఇదిలా ఉండగా భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని ప్రపంచ స్థాయి నిర్మాణ విలువలతో రూపొందిస్తున్నారు. ఈ సినిమాకు హాలీవుడ్ ప్రముఖ సంగీత దర్శకుడు హాన్స్ జిమ్మర్‌తో పాటు భారతీయ దిగ్గజ సంగీత దర్శకుడు ఏ.ఆర్. రెహమాన్ సంగీతం అందిస్తున్నారు. ఇద్దరు అంతర్జాతీయ స్థాయి సంగీత దర్శకులు కలిసి పని చేయడం ఈ ప్రాజెక్ట్‌కు మరింత ప్రత్యేకతను తీసుకొస్తోంది. అత్యాధునిక సాంకేతికత, విజువల్ ఎఫెక్ట్స్‌తో ఈ చిత్రాన్ని రూపొందించేందుకు మేకర్స్ ప్రత్యేకంగా కృషి చేస్తున్నారు. భారతీయ పురాణాల్లో అత్యంత ప్రాధాన్యం ఉన్న రామాయణాన్ని ప్రపంచ స్థాయిలో ప్రేక్షకులకు అందించాలనే లక్ష్యంతో ఈ సినిమా తెరకెక్కుతోంది. ఈ భారీ చిత్రాన్ని ఈ ఏడాది దీపావళి సందర్భంగా ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేయాలని మేకర్స్ ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.




# యూఎస్‌లో 'ఉస్తాద్ భగత్ సింగ్' హవా.. ప్రీమియర్ బుకింగ్స్‌లోనే భారీ వసూళ్లు

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ హీరోగా దర్శకుడు హరీష్ శంకర్ తెరకెక్కిస్తున్న మాస్ ఎంటర్టైనర్ చిత్రం 'ఉస్తాద్ భగత్ సింగ్' ఇప్పటికే భారీ అంచనాలు సృష్టిస్తోంది. విడుదలకు ముందే ఈ సినిమా పలు రికార్డులను సృష్టించేలా దూసుకెళ్తోంది. ముఖ్యంగా ఓవర్సీస్ మార్కెట్‌లో ఈ సినిమాకు మంచి స్పందన లభిస్తోంది.

అమెరికాలోని నార్త్ అమెరికా ప్రాంతంలో 'ఉస్తాద్ భగత్ సింగ్' ప్రీమియర్ షోల బుకింగ్స్ ప్రారంభం కావడంతో అభిమానులు పెద్ద ఎత్తున టికెట్లు బుక్ చేస్తున్నారు. బుకింగ్స్ ప్రారంభమైన కొన్ని గంటల్లోనే ఈ సినిమా 50 వేల డాలర్లకు పైగా గ్రాస్ వసూలు చేయడం విశేషం. దీంతో విదేశాల్లో కూడా ఈ సినిమాపై భారీ క్రేజ్ ఉందని ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి.

ఇది కేవలం ప్రారంభం మాత్రమేనని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు. పవన్ కళ్యాణ్‌కు ఓవర్సీస్‌లో ఉన్న భారీ ఫ్యాన్ ఫాలోయింగ్ కారణంగా రాబోయే రోజుల్లో బుకింగ్స్ మరింత పెరిగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. ముఖ్యంగా సినిమా కంటెంట్ బలంగా ఉంటే నార్త్ అమెరికా మార్కెట్‌లో భారీ వసూళ్లు సాధించే అవకాశముందని ట్రేడ్ వర్గాలు పేర్కొంటున్నాయి.

ఈ సినిమాలో శ్రీలీల, రాశీ ఖన్నా హీరోయిన్లుగా నటిస్తున్నారు. ప్రముఖ సంగీత దర్శకులు దేవి శ్రీ ప్రసాద్, ఎస్.ఎస్. థమన్ సంగీతం అందిస్తున్నారు. భారీ నిర్మాణ విలువలతో మైత్రి మూవీ మేకర్స్ ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. పవన్ కళ్యాణ్ – హరీష్ శంకర్ కాంబినేషన్‌లో వస్తున్న ఈ సినిమాపై అభిమానుల్లో ఇప్పటికే భారీ ఆసక్తి నెలకొంది.

మాస్ యాక్షన్ ఎంటర్టైనర్‌గా రూపొందుతున్న 'ఉస్తాద్ భగత్ సింగ్' చిత్రం మార్చి 19న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది. ఇప్పటికే ఓవర్సీస్‌లో మంచి బిజినెస్ సాధించడంతో బాక్సాఫీస్ వద్ద ఈ సినిమా ఎలాంటి రికార్డులు సృష్టిస్తుందో చూడాలని అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. 'ఓజీ' చిత్రం తర్వాత పవన్ కళ్యాణ్ నుంచి వస్తున్న ఈ సినిమాపై సినీ వర్గాల్లో కూడా భారీ అంచనాలు నెలకొన్నాయి.

# అలాంటి మగవాళ్లను వదిలే ప్రసక్తే లేదు.. : వరలక్ష్మి సంచలన వ్యాఖ్యలు

తెలుగు, తమిళ సినీ పరిశ్రమల్లో క్యారెక్టర్ ఆర్టిస్టుగా మంచి గుర్తింపు పొందిన నటి వరలక్ష్మి శరత్‌కుమార్ చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారాయి. ఇటీవల ఆమె ప్రధాన పాత్రలో నటిస్తూ దర్శకత్వం వహించిన 'సరస్వతి' సినిమా ప్రమోషన్లలో భాగంగా ఇచ్చిన ఇంటర్వ్యూలో చిన్నారులపై జరిగే లైంగిక దాడులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి నేరాలకు పాల్పడే వారిపై అత్యంత కఠిన చర్యలు తీసుకోవాలని ఆమె అభిప్రాయపడ్డారు. చిన్నపిల్లలపై జరుగుతున్న లైంగిక దాడులు సమాజానికి పెద్ద ప్రమాదంగా మారుతున్నాయని వరలక్ష్మి పేర్కొన్నారు. అలాంటి నేరాలకు పాల్పడే వారిని అసలు వదిలిపెట్టకూడదని, వారికి సాధారణంగా విధించే శిక్షలు సరిపోవని ఆమె అన్నారు. చిన్నారులను హింసించే వ్యక్తులకు మరింత కఠినమైన శిక్షలు ఉండాలని, సమాజంలో అలాంటి నేరాలు చేయాలనే ఆలోచనకే భయపడే పరిస్థితి రావాలని ఆమె వ్యాఖ్యానించారు.

తాను ఎప్పుడైనా ముఖ్యమంత్రి అయితే రేప్ వంటి నేరాలకు పాల్పడే వ్యక్తులపై కఠినమైన చట్టాలు తీసుకొస్తానని వరలక్ష్మి అన్నారు. అలాంటి చట్టాలు అమల్లో ఉంటే నేరాలు చేసే ముందు వారు వందసార్లు ఆలోచిస్తారని పేర్కొన్నారు. సమాజంలో నేరాలపై భయం పెరగడం కూడా అవసరమని ఆమె అభిప్రాయపడ్డారు.

అదే సమయంలో చిన్నారుల భద్రత విషయంలో తల్లిదండ్రులు కూడా అప్రమత్తంగా ఉండాలని వరలక్ష్మి సూచించారు. చిన్నప్పటి నుంచే పిల్లలకు 'గుడ్ టచ్', 'బ్యాడ్ టచ్' గురించి అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని చెప్పారు. పిల్లలు ఎలాంటి సమస్య ఎదురైనా భయపడకుండా చెప్పేలా వారికి ధైర్యం, నమ్మకం కల్పించడం తల్లిదండ్రుల బాధ్యత అని ఆమె పేర్కొన్నారు.

ఇక వరలక్ష్మి శరత్‌కుమార్ నటించిన 'సరస్వతి' సినిమా చిన్నారులపై జరుగుతున్న లైంగిక దాడుల నేపథ్యంలో రూపొందిన సామాజిక అంశాలతో కూడిన చిత్రంగా తెరకెక్కింది. ఈ చిత్రంతో ఆమె దర్శకురాలిగా కూడా కొత్త ప్రయాణాన్ని ప్రారంభించారు. ప్రస్తుతం ఈ సినిమా ప్రమోషన్లలో బిజీగా ఉన్న ఆమె చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో విస్తృతంగా వైరల్ అవుతున్నాయి.



Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in